


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 17, పేజీలు - 08

ఆదివారం, జులై 12, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## కిలాడీల కమిటీ ఢిల్లీ వెళ్లి ఎన్డీఎస్ఏను ఒప్పించాలి

**- కాళేశ్వరంపై హరీష్ , కేటీఆర్, ఈటలకు రేవంత్ సవాల్**

- కాళేశ్వరం బ్యారేజీల గేట్లు మూయడం ప్రమాదకరమని సీఎం హెచ్చరిక
- పునరుద్ధరణ పూర్తయ్యే వరకు గేట్లు తెరిచే ఉంచాలని స్పష్టీకరణ
- జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారమే మరమ్మతులు
- బీఆర్ఎస్ నేతల కమిటీ సిఫార్సులను పక్కనపెడుతున్నట్టు వెల్లడి
- గత ప్రభుత్వ అవినీతి వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి అని విమర్శలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీల దుస్థితి, సాగునీటి లభ్యతపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్రంగా తిప్పికొట్టారు. శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో వర్షాల వల్ల గోదావరిలో పారుతున్న నీళ్లను తక్షణమే ఎత్తిపోయాలంటూ బీఆర్ఎస్ నేతలు, వారి అడుగుజాడల్లో బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఈటెల రాజేందర్ అంటే తమకు గౌరవమేనని, కానీ ఆయన హరీష్ రావు సూచనల మేరకు వివరాలు తెలుసుకోకుండా మాట్లాడటం వల్ల ఆ గౌరవాన్ని కోల్పోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తాము నిపుణుల కమిటీ సూచనలు పాటిస్తుంటే, కేసీఆర్ చైర్మన్‌గా, హరీష్, కేటీఆర్ సభ్యులుగా ఒక కిలాడీల కమిటీ ఏర్పడిందని, ఇప్పుడు ఈటెల కూడా ఆ గజదొంగల గుంపులో చేరడం దారుణమన్నారు. వీరందరినీ చర్లపల్లి జైలుకు పంపితేనే వారు చేసిన అప్పులేంటో, తప్పులేంటో జనానికి తెలుస్తాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

2లో..




## ఏఐ వచ్చినా..
## యుద్ధంలో గెలిచేది సైనికులే

**- విశాఖలో ఐఎన్ఎస్ మహేంద్రగిరి నౌకాదళంలోకి ప్రవేశం**
**- సంప్రదాయ, ఆధునిక సైనిక శక్తి మధ్య సమతుల్యం అవసరం**
**- యుద్ధనౌకల నిర్మాణంతో దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు**

విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి నూతన సాంకేతికతలు యుద్ధ స్వరూపాన్ని మారుస్తున్నప్పటికీ, అంతిమంగా విజయాన్ని నిర్ణయించేది సంప్రదాయ సైనిక సామర్థ్యాలు, శిక్షణ పొందిన సైనికులు, దేశ సంకల్పమేనని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. నేడు విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' యుద్ధనౌకను నౌకాదళంలోకి ప్రవేశపెట్టిన అనంతరం ఆయన ప్రసంగించారు. భవిష్యత్ యుద్ధాలు ఏఐతో జరగవచ్చేమో గానీ, వాటిని గెలిచేది మాత్రం మన సైనికులు, విశ్వసనీయ సైనిక బలంతోనేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ "నూతన సాంకేతికతలు యుద్ధ స్వభావాన్ని మార్చిన మాట వాస్తవమే. కానీ, సంప్రదాయ యుద్ధ సామర్థ్యాల ప్రాధాన్యతను అవి ఏమాత్రం తగ్గించలేదు. యుద్ధం ప్రాథమిక సూత్రాలను నెరవేర్చడానికి బలమైన సంప్రదాయ సామర్థ్యాలు నేటికీ ఎంతో అవసరం. కేవలం కొత్త టెక్నాలజీపై ఆకర్షణతో సంప్రదాయ సైనిక శక్తిని నిర్లక్ష్యం చేసిన దేశాలు భారీ మూల్యం చెల్లించుకున్నాయని చరిత్ర మనకు గుర్తుచేస్తోంది" అని వివరించారు.

2లో..



## నిమ్స్‌లో మెడికల్ మాఫియా గుట్టురట్టు

**- బౌన్సర్లతో రోగులను బెదిరిస్తూ కోట్ల దందా!**
**- మెడికల్ మాఫియాపై నిమ్స్ డైరెక్టర్ సీరియస్**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పేద, మధ్యతరగతి రోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో మెడికల్ మాఫియా రెచ్చిపోతుంది. ఆసుపత్రి ప్రాంగణాన్ని అడ్డాగా మార్చుకుని బౌన్సర్లను పెట్టి మరీ రోగులకు బలవంతంగా మందులు అంటగడుతున్న ఒక మెడికల్ షాపు యజమాని దందా ఇప్పుడు నిమ్స్ ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. కోట్ల రూపాయల విలువైన ఈ అక్రమ వ్యాపార సామ్రాజ్యం వెనుక ఆసుపత్రిలోని కొందరు అధికారుల, వైద్యుల హస్తం కూడా ఉన్నట్లు విచారణలో తేలడం సంచలనం రేపుతోంది.

సాధారణంగా ప్రముఖులు, సెలబ్రెటీల రక్షణకు ఉండే బౌన్సర్లను ఇక్కడ రోగులను భయపెట్టడానికి ఉపయోగించటం విస్తుగొలుపుతోంది.

ఆసుపత్రికి వచ్చే రోగులను ముందుగా నవ్వుతూ పలకరించి వారు మాట వినకపోతే బలవంతంగా తమ మందుల షాపునకే లాక్కెళుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ యువతిని ఇలాగే బౌన్సర్లు ఇబ్బంది పెట్టడంతో ఆమె గొడవకు దిగి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నాటి అధికారులు ఈ విషయాన్ని బయటకు రాకుండా తొక్కిపెట్టారు. అంతేకాకుండా సదరు దుకాణదారుడు నిమ్స్ నిబంధనలకు విరుద్ధంగా దుకాణం ముందు భాగంలో షెడ్డు వేసి స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా ఎటువంటి అనుమతులు లేకుండా స్పెషాలిటీ బ్లాక్‌లోని ఒక పెద్ద గదిని

2లో..

### తెలంగాణలో పెట్టుబడులకు
## ఎమిరేట్స్ ఆసక్తి

**- సీఎం రేవంత్ ను కలిసిన ఎమిరేట్స్ విమాన సంస్థ వైస్ ప్రెసిడెంట్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో పెట్టుబడులకు ఎమిరేట్స్ సంస్థ ఆసక్తి చూపుతోందని, ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ ఏ-380 సర్వీసులను ప్రారంభించడానికి ఎమిరేట్స్ విమానయాన సంస్థ సుముఖత వ్యక్తం చేసిందని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం ఎమిరేట్స్ విమానయాన సంస్థ (ఇండియా, నేపాల్) వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సర్హాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ విమానయాన సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఎమిరేట్స్

2లో..



## మైక్రో ఫ్యామిలీలపై ఆలోచన ప్రమాదకరం

**- పిల్లలే సంపద, ఉమ్మడి కుటుంబమే శ్రీరామ రక్ష**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** జనాభా నియంత్రణ కాకుండా జనాభా సంరక్షణ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సమీప భవిష్యత్తులోనే 'పిల్లలే సంపద' అనే మాటను నిజం చేసి చూపుతామని సీఎం అన్నారు. విజయవాడలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గతంలో జనాభా నియంత్రణ కోసం ప్రభుత్వాలు పనిచేశాయని దీని కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు కలిగిన వారిని అనర్హులు చేస్తూ నిబంధనలు కూడా తెచ్చామని ప్రస్తుతం పరిస్థితులు మారాయని సీఎం స్పష్టం

2లో..





### రైతాంగాన్ని రేవంత్
## నిలువునా ముంచేస్తున్నారు

**- 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చన్న కేటీఆర్**
**- మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూయకుండానే కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయవచ్చు**
**- కాళేశ్వరంను బద్నాం చేయాలనే కుట్రతోనే నీళ్లు ఇవ్వడం లేదని ఆరోపణ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో సాగునీటి సంక్షోభం, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన కేటీఆర్ మాట్లాడుతూ రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి సీఎం సోయి తెచ్చుకోవాలని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని ఫోరం సూచించిందని తెలిపారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల నీటి ప్రవాహం ఉందని చెప్పారు. 94 మీటర్ల లభ్యత వద్దే పంపులు ఆన్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారన్నారని

2లో..

### హైదరాబాద్ టు చెన్నై
## రెండు గంటల్లోనే

- తెలంగాణ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందన్న అశ్వినీ వైష్ణవ్
- హైదరాబాద్ నుంచి విజయవాడకు గంటలో చేరుకోవచ్చన్న రైల్వే మంత్రి
- తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఏడు బుల్లెట్ రైళ్లలో, ఏకంగా మూడు రూట్లు తెలంగాణకే దక్కడం విశేషమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వల్లే రాష్ట్రానికి ఈ భారీ ప్రాజెక్టులు వచ్చాయని, రాబోయే రోజుల్లో తెలంగాణ దేశంలోనే ఒక పెద్ద బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయాలు ఊహించని విధంగా తగ్గిపోతాయన్నారు. ముఖ్యంగా, హైదరాబాద్

2లో..

### మూగబోయిన గాన కోకిల

**- లెజండరీ సింగర్ ఎస్.జానకి కన్నుమూత**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారతీయ సంగీత ప్రపంచంలో ఒక సువర్ణ అధ్యాయం ముగిసింది. దశాబ్దాల పాటు తన అమృత గాత్రంతో కోట్లాది మందిని అలరించిన 'దక్షిణ భారత కోకిల' ఎస్. జానకి (88) శనివారం కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్య

2లో..

## పల్లి పల్లి మినిస్టర్

- విజయవంతంగా మంత్రి లోకేశ్ కొరియా పర్యటన
- వారం రోజుల్లో 50కి పైగా కంపెనీలతో పెట్టుబడుల కోసం చర్చలు
- ఎల్జీ, హ్యూందాయ్, శాంసంగ్ వంటి దిగ్గజ సంస్థల సానుకూల స్పందన

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ చేపట్టిన వారం రోజుల దక్షిణ కొరియా పర్యటన అద్భుతరీతిలో విజయవంతమైంది. భారత్-కొరియా మధ్య వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే క్రమంలో ఈ పర్యటన ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. దక్షిణ కొరియా విదేశాంగ శాఖ అధికారిక ఆహ్వానం మేరకు ఈ నెల 5 నుంచి 11 వరకు సాగిన ఈ పర్యటనలో మంత్రి లోకేశ్, ఆయన బృందం అక్కడి ప్రభుత్వ,

2లో..



## విషాదంగా మారిన విహారయాత్ర

- వియత్నాంలో భారత పర్యాటకులతో వెళుతున్న స్పీడ్‌బోట్ బోల్తా
- ప్రమాదంలో గాయపడిన పలువురి పరిస్థితి విషమం
- ఫు క్వాక్ దీవి సమీపంలో అదుపుతప్పిన పడవ
- రంగంలోకి దిగిన భారత ఎంబసీ.. సహాయక చర్యలు ముమ్మరం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం

2లో..



# కిలాడీల కమిటీ ఢిల్లీ వెళ్లి ఎన్డీఎస్ఏను ఒప్పించాలి

## నిర్మాణంలో ఘోర లోపాలు.. 11 నెలలకే కుప్పకూలే స్థితికి మేడిగడ్డ!

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్లానింగ్, డిజైనింగ్, ఆపరేషనల్ మెయింటెనెన్స్‌లో చేసిన చారిత్రక తప్పిదాల వల్లే నేడు ప్రాజెక్టు ఈ దుస్థితికి చేరిందని ముఖ్యమంత్రి వివరించారు. జూన్ 29, 2019న కేసీఆర్ కాళేశ్వరాన్ని ప్రారంభిస్తే.. కేవలం 11 నెలలకే, అంటే 18-5-2020 నాడే మేడిగడ్డ బ్యారేజీలో తీవ్ర లోపాలున్నాయని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవీ రమణారావు అధికారికంగా లేఖ రాశారని రేవంత్ బయటపెట్టారు. నాటి ప్రభుత్వం ఆ హెచ్చరికలను పట్టించుకోకపోవడం వల్లే సమస్య పెద్దదై, అక్టోబర్ 21, 2023న మేడిగడ్డ 7వ బ్లాక్ కుంగిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 చట్టప్రకారమే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మేడిగడ్డను సందర్శించిందని, తమ అవినీతి బయటపడుతుందనే భయంతోనే బీఆర్ఎస్ నేతలు ఎన్డీఎస్ఏ పర్యటనపై నీలినీడలు కమ్ముతున్నారని దుయ్యబట్టారు.

## ఎన్డీఎస్ఏ నివేదిక సమగ్రం

పది నెలల పాటు క్షేత్రస్థాయిలో నిపుణులు రకరకాల పరీక్షలు జరిపిన అనంతరం ఎన్డీఎస్ఏ సమర్పించిన తుది నివేదికలోని అంశాలను సీఎం రేవంత్ రెడ్డి క్లియర్‌గా చదివి వినిపించారు. నివేదికలోని 346వ పేజీలో మేడిగడ్డ 7వ బ్లాక్ తీవ్రంగా దెబ్బతినడం వల్ల అది నీటి మళ్లింపునకు పనికిరాకుండా పోయిందని స్పష్టంగా ఉందన్నారు. అలాగే 352వ పేజీలో అన్నారం బ్యారేజీ, 356వ పేజీలో సుందిళ్ల బ్యారేజీ తీవ్రంగా దెబ్బతిన్నాయని, అక్కడ నీటి నిల్వ కానీ, మళ్లింపు కానీ అస్సలు సురక్షితం కాదని నిపుణులు తేల్చిచెప్పారని గుర్తుచేశారు. నివేదిక ఎగ్జిక్యూటివ్ సమ్మరీలోని 17వ పాయింట్ ప్రకారం.. ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణకు సమగ్రమైన కొత్త డిజైన్లు అవసరమని, తక్షణ స్థిరీకరణ చర్యలు చేపట్టాలని సిఫారసు చేసింది. కేంద్రం లేదా సీడబ్ల్యూసీ ఆమోదం లేకుండా అక్కడ రిపేర్లు చేయడం అసాధ్యమని సీఎం స్పష్టం చేశారు.

## కన్నెపల్లిలో నీళ్లే లేవు.. గేట్లు మూస్తే బ్యారేజీలు కొట్టుకుపోతాయి

నదిలో ప్రవాహం ఉండటం వేరు.. పంపింగ్‌కు అవసరమైన నీటిమట్టం ఉండటం వేరు అని రేవంత్ రెడ్డి టెక్నికల్ అంశాలను వివరించారు. మేడిగడ్డ బెడ్ లెవల్ 88.50 మీటర్లు, క్రెస్ట్ లెవల్ 89.50 మీటర్లు కాగా అక్కడ నుంచి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లి పంప్ హౌజ్ ద్వారా నీటిని లిఫ్ట్ చేయాలంటే కనీసం 93.50 మీటర్ల పంపింగ్ లెవల్ ఉండాలన్నారు. కానీ ప్రస్తుతం అక్కడ కేవలం 89.90 మీటర్ల నీటిమట్టం మాత్రమే ఉందనే నిజాన్ని బయటపెట్టారు. అన్నారం, సుందిళ్లలో కూడా గేట్లు మూస్తే తప్ప చుక్క నీరు నిల్వ ఉండదని, అయితే బ్యారేజీలు భద్రంగా లేవు కాబట్టి గేట్లు అస్సలు మూయవద్దని ఎన్డీఎస్ఏ ఖచ్చితమైన ఆదేశాలిచ్చిందన్నారు. ఒకవేళ కన్నెపల్లి నుండి ఎత్తిపోసినా, పైన గేట్లు ఓపెన్ ఉన్నందున ఆ నీరంతా మళ్లీ మేడిగడ్డకే వస్తుందని ఇలాంటి పరిస్థితుల్లో నీళ్లు ఎత్తిపోయండి అని అరుస్తున్న వారు ఇంజనీర్ల ముసుగులో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

## పోలవరంకు నీళ్లు పోతుంటే హరీష్ రావు నాడు గాడిదలు కాసారా?

కేంద్ర ప్రభుత్వం ఇటీవలే మూడు బరాజుల పునరుద్ధరణ చర్యల కోసం ప్రత్యేక సాంకేతిక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఎన్డీఎస్ఏ గైడ్‌లైన్స్ ప్రకారమే ముందుకు వెళ్తుందని సీఎం స్పష్టం చేశారు. ఈటెల రాజేందర్ మీ కిలాడీల కమిటీని తీసుకుని ఢిల్లీలోని ఎన్డీఎస్ఏ వద్దకు వెళ్లి, వారిని ఒప్పించండి, మేము కూడా పంపులు ఆన్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం అని సవాల్ విసిరారు. మాజీ మంత్రి హరీష్ రావు నాడు కమిషన్లు బొక్కిన సంగతి తెలిసి కేసీఆరే ఆయనను పక్కనబెట్టారని, కమీషన్ల కక్కుర్తితో ఇప్పుడు క్రషర్లను కూడా వదలడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో పట్టిసీమ ద్వారా ఏపీకి 105 టీఎంసీలు తరలిస్తుంటే హరీష్ రావు గాడిదలు కాసారా అని ప్రశ్నించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే పోలవరంకు తెలంగాణ నీళ్లు పోవని హరీష్ రావు గ్యారెంటీ ఇవ్వగలరా అని నిలదీస్తూ, ఈ గజదొంగల గుంపులో ఈటెల చేరవద్దని హితవు పలికారు.

# ఏఐ వచ్చినా.. యుద్ధంలో గెలిచేది సైనికులే

నూతన టెక్నాలజీ, సంప్రదాయ వేదికలు ఒకదానికొకటి పోటీ కాదని, అవి పరస్పర పూరకాలు అని రక్షణ మంత్రి తెలిపారు. "ఒక సంప్రదాయ వేదిక కొత్త టెక్నాలజీ లేకుండా బలహీనపడుతుంది, అదే సమయంలో టెక్నాలజీకి ఒక వేదిక అవసరం. అందుకే, రెండు రంగాల్లోనూ రాణిస్తూ, వాటి మధ్య సమతుల్యం పాటించాలనేది భారత విధానం. భవిష్యత్ సాంకేతికతలపై పెట్టుబడులు పెడుతూనే, మన సంప్రదాయ సామర్థ్యాలను నిరంతరం పదునుపెట్టుకుంటాం. ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఈ సంకల్పానికి, నిబద్ధతకు ప్రతీక" అని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' వంటి సైనిక చర్యలు.. సంప్రదాయ, ఆధునిక సామర్థ్యాలను సమర్థవంతంగా మేళవించగల భారత శక్తిని నిరూపించాయని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. ఆత్మరక్షణకే కాకుండా అవసరమైనప్పుడు శత్రువుపై నిర్ణయాత్మకమైన దెబ్బకొట్టి, వారిని పూర్తిగా నిర్మూలించగల సత్తా భారత్‌కు ఉందని ఈ ఆపరేషన్ రుజువు చేసిందని పేర్కొన్నారు. యుద్ధనౌకల నిర్మాణం కేవలం నౌకాదళాన్ని బలోపేతం చేయడమే కాదని, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తినిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. "ఒక యుద్ధనౌక నిర్మాణం అంటే ఒక పరిశ్రమల వ్యవస్థను నిర్మించడమే. ఉక్కు, ఎలక్ట్రానిక్స్, సెన్సార్లు, ప్రొపల్షన్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్, లాజిస్టిక్స్ వంటి ఎన్నో రంగాలను ఇది ముందుకు నడిపిస్తుంది. దీనివల్ల లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది, కొత్త టెక్నాలజీలు అభివృద్ధి చెందుతాయి, దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుంది" అని తెలిపారు. భారత్‌ను నౌకా నిర్మాణ రంగంలో గ్లోబల్ హబ్‌గా నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీనికోసం 'మారిటైమ్ ఇండియా విజన్ 2030'పై వేగంగా పనిచేస్తున్నామని చెప్పారు. మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్, షిప్‌బిల్డింగ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీమ్ వంటి పథకాల ద్వారా ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

# తెలంగాణలో పెట్టుబడులకు ఎమిరేట్స్ ఆసక్తి

ఏ-380 సర్వీసులను ప్రారంభించడంతో పాటు సంస్థ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలోని వరంగల్, ఆదిలాబాద్ రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వాటి ప్రాధాన్యతను వివరిస్తూ, రాష్ట్రంలో ఎమిరేట్స్ ఎంఆర్‌ఓ ఆపరేషన్స్‌ను కొనసాగించాలని కోరారు. విమాన సర్వీసులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి స్పోర్ట్ యూనివర్సిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్ విషయంలో కూడా ఎమిరేట్స్ ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. సిఎం విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ సర్వీసులను ప్రారంభించడానికి మహమ్మద్ సర్హన్ సానుకూలతను వ్యక్తం చేశారు. అలాగే క్రీడాకారులను ప్రోత్సహించే విషయంలో స్పాన్సర్‌షిప్ అందించడంపైన వారు సానుకూలంగా స్పందించారు.

# నిమ్స్‌లో మెడికల్ మాఫియా

# గుట్టురట్టు

తమ సొంత మందుల గోదాంగా మార్చుకున్నాడు. దీనికి ఎలాంటి అద్దె కూడా చెల్లించకుండా యథేచ్ఛగా నిల్వలు సాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా సాగుతున్న ఈ అక్రమ దందా వ్యవహారం ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవ్‌రాజ్ దృష్టికి వెళ్ళింది. దీనిపై ఆయన ప్రాథమిక విచారణ జరిపించగా దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెలుగుచూశాయి. దీంతో వెంటనే స్పందించిన డైరెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కఠిన చర్యలకు ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణం నుండి బౌన్సర్లను తక్షణమే తొలగించడమే కాకుండా ఈ మొత్తం వ్యవహారాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కొందరు డాక్టర్లతో సదరు మెడికల్ షాపు నిర్వాహకులకు ఉన్న లోపాయికారీ ఒప్పందాలు, నిమ్స్ లోపల వారికి అండగా నిలుస్తున్న అధికారులు ఎవరు అనే కోణంలో ప్రస్తుతం అంతర్గత విచారణ ముమ్మరం చేశారు. బాధ్యులైన వారిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు.

# రైతాంగాన్ని రేవంత్ నిలువునా ముంచేస్తున్నారు

ఈ లెక్కన నీటిని పంప్ చేయవచ్చని అన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నా ఈ ప్రవాహం మరో 100 రోజులు కొనసాగుతుందని రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే గోదావరి బేసిన్‌లోని అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతో నీళ్లివ్వడం లేదని ఆరోపించారు. 'ఇది కాలం తెచ్చిన కరవు కాదు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు' అని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన కొనసాగితే కాంగ్రెస్‌కు 117 సీట్లు కాదు కదా, 7 సీట్లు కూడా రావని హెచ్చరించారు.

# మైక్రో ఫ్యామిలీలపై ఆలోచన ప్రమాదకరం

చేశారు. దీనికి అనుగుణంగా ఇప్పుడు విధానాలను మార్చుకోవాల్సిన తరుణం వచ్చేసిందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఫెర్టిలిటీ రేట్ గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉందని భవిష్యత్తులో జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తుగా పరిస్థితులు మారతాయని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

## 40కిపైగా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది

ప్రపంచవ్యాప్తంగా 40కిపైగా దేశాల్లో జనాభా తగ్గిపోతోందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పిల్లలే సంపద కార్యక్రమానికి ఇవాల్టి నుంచే నాంది పలకాలని భావిస్తున్నాం. దేశమంటే మట్టి కాదోయ్-దేశమంటే మనుషులోయ్ అని గురజాడ చెప్పిన మాటల్ని మరో మారు గుర్తు చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. జనాభా నియంత్రణ కాదు జనాభా సంరక్షణ కార్యక్రమాల్ని ప్రభుత్వం చేపడుతుంది. గతంలో జనాభా నియంత్రణపై ఆలోచన చేశాం. దానికి అనుగుణంగా ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టాయి. మహిళల్లో అక్షరాస్యత పెరిగితేనే జనాభా నియంత్రణ సాధ్యమని అప్పట్లో ఆలోచన చేశాం. స్థానిక సంస్థల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీకి అనర్హత అనే నిబంధనలు కూడా పెట్టాం. ఒక్కరు ముద్దు, ఇద్దరితో సరి, ముగ్గురు వద్దు అనే లాంటి ప్రచారాలు కూడా చేశాం. 20 ఏళ్ల క్రితం ఐటీ లాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని సంపద సృష్టించాం. అప్పుడు ఐటీ, ఇప్పుడు ఏఐ గురించి మాట్లాడుతున్నాను. జనాభా నిర్వహణ గురించి కూడా చర్చిస్తున్నాం. ఆడబిడ్డల్ని చదివిస్తేనే కుటుంబానికి ఆస్తి, గతంలో వరకట్నం ఉండేది ఇప్పుడు ఎదురు కట్నం అనే పరిస్థితి వచ్చింది. అందుకే మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ గురించి మాట్లాడుతున్నాం. టోటల్ ఫెర్టిలిటీ రేటు మన రాష్ట్రంలోనూ పెరగాల్సి ఉంది. ఎలాంటి అభివృద్ధి అయినా జనాభా ఉంటేనే అది సార్థకం అవుతుంది'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

## అభివృద్ధి కోసం జనాభా నిర్వహణ కీలకం

'మైక్రో ఫ్యామిలీల గురించి యువత ఆలోచన చేయటం ప్రమాదకరం. ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో జనాభా గణనీయంగా తగ్గిపోతోంది. భారత్ లో దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి కూడా అదే. మన అభివృద్ధి సంతులనం కావాలంటే జనాభా నిర్వహణ చాలా కీలకం. అంగన్‌వాడీలు, పాఠశాలల్లోనూ చిన్నారుల సంఖ్య తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ప్రతీ వంద మంది జనాభాలో 89శాతం మందికి రెండో సంతానం లేదు. ఏపీలోని విశాఖ లాంటి జిల్లాల్లోనూ ఫెర్టిలిటీ రేటు అతి తక్కువగా ఉంది. ఏపీ విస్తీర్ణంలో 7 స్థానంలో ఉన్నా పాపులేషన్ డెన్సిటీలో దిగువన ఉన్నాం. పిల్లలే మన రాష్ట్ర సంపద. వారితోనే ఆర్థిక ప్రగతి. సరిపడా జనాభా లేకుంటే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఆర్థిక ప్రగతి సాధించేలా రాష్ట్రంలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తున్నాం. పీ4 ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచుతున్నాం. అభివృద్ధి ప్రాజెక్టులు కూడా సమతూకంలో జరగాలనే అన్ని ప్రాంతాలకూ పరిశ్రమలు, ప్రాజెక్టులు వచ్చేలా చూస్తున్నాం. ఆర్థిక అసమానతలు తగ్గించి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. జనాభా సంరక్షణ అనేదే ఈ సమయంలో కీలకం. జనాభా పెంచాలని మాట్లాడితే విమర్శలు వచ్చాయి. పిల్లలను పెంచటం అనేది కేవలం మహిళలు ఒక్కరిదే బాధ్యత మాత్రమే కాదు అది ఉమ్మడి బాధ్యత. కాన్పుల్లో సిజేరియన్ ఆపరేషన్లు తగ్గాలి. మహిళల ఆరోగ్య రక్షణ అత్యంత కీలకం. జనాభా నిర్వహణ ఇక ఓ వాస్తవిక అంశం అని గుర్తించాలి. సంతానం వద్దనుకునే దంపతులు పెరగటం దురదృష్టకరం. మైక్రో ఫ్యామిలీలు వద్దు- భారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థే ప్రపంచానికి ఆదర్శం. పిల్లలే సంపద- ఉమ్మడి కుటుంబమే శ్రీరామ రక్ష'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు.

## సామాజిక మాధ్యమాలతో మానసిక సమస్యలు

'తెలంగాణాలో జరిగిన ఘటన అత్యంత బాధాకరం. పోక్సో కేసులో ఉన్న నిందితుడు తనపై కేసు పెట్టిన వారి కుటుంబంలో 6 గురిని హత్య చేశాడు. అత్యంత దారుణమైన ఘటన ఇది. సామాజిక మాధ్యమాలు బాధ్యతారహితంగా వినియోగించటం, అసభ్యకరమైన, హింసాత్మక దృశ్యాల కారణంగా మానసిక సంతులన కోల్పోతున్నారు. విలువైన సమయాన్ని కూడా వృధా చేసుకుంటున్నారు. సోషల్ మీడియా వ్యసనంగా మారితే ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతాయి. టెక్నాలజీ- స్పిర్చువాలిటీ ద్వారా యువతకు ప్రపంచాన్ని జయించే శక్తి సొంతం అవుతుంది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం సంజీవని కార్యక్రమం చేపట్టాం. యువతతో పాటు వృద్ధులు సమాజానికి ఆస్తిగా తయారు కావాలి. త్వరలో ప్రభుత్వం వృద్ధుల కోసం క్షేమం అనే కార్యక్రమాన్ని తీసుకురావాలని ఆలోచన చేస్తోంది. నిరంతరం నైపుణ్యాలను అందిపుచ్చు కుంటేనే అత్యుత్తమ మానవ వనరులు దేశానికి అందుతాయి. టెక్నాలజీ- నాలెడ్జి ఉన్నా దేశంలో చాలా రంగాల్లో నాయకత్వ లేమి ఉంది. అంగన్‌వాడీల నుంచే పిల్లల ఆరోగ్యంతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తున్నాం. పాఠశాలల్లో విద్య అందించేందుకు తల్లికి వందనం కింద ప్రతీ ఒక్కరికీ రూ.15వేల చొప్పున ఇస్తున్నాం. 2047 నాటికి మన తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేర్చాలన్నదే నా సంకల్పం. జనాభా లేకపోతే మనం చేసుకున్న అభివృద్ధి లక్ష్యాలను సాధించలేం. 2040కే స్వర్ణాంధ్ర సాధించే సత్తామనకుంది'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అనంతరం పాపులేషన్ మేనేజ్మెంట్ ఫ్రేమ్ వర్క్ డాక్యుమెంటేషన్ ను ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దే రామ్మోహన్ రావు, వైద్యారోగ్యం కుటంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీషా తదితరులు హాజరయ్యారు.

# హైదరాబాద్ టు చెన్నై రెండు గంటల్లోనే

నగరవాసులకు ఈ రైళ్లతో ప్రయాణ కష్టాలు పూర్తిగా తీరిపోనున్నాయి. బుల్లెట్ రైలు ఎక్కితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం ఒక గంట పది నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వివరించారు. అలాగే వ్యాపార రాజధాని ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాలు, అటు చెన్నై నగరానికి కేవలం రెండు గంటల్లోనే దూసుకుపోవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ దేశ రవాణా రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఇదే గ్యాప్‌లో ఈ ప్రాజెక్టుల క్రెడిట్ కోసం కొందరు పాకులాడుతున్నారంటూ విపక్షాలపై మంత్రి మండిపడ్డారు. దీని పూర్తి క్రెడిట్ ప్రధాని మోదీకే దక్కుతుందని, గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేవలం రూ. 800 కోట్లు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం ఒక్క తెలంగాణకే ఏకంగా రూ. 5000 కోట్ల రైల్వే నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. ఈ నిధుల వరద వల్లే రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయనిస్పష్టం చేశారు.

# మూగబోయిన గాన కోకిల

సమస్యలతో బాధపడుతున్న ఆమె మైసూర్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటు కారణంగా తుదిశ్వాస విడిచారు. ఆమె మరణవార్త విన్న సినీ లోకం దిగ్భ్రాంతికి గురైంది. భారతీయ చిత్రసీమ, ముఖ్యంగా దక్షిణాది సినీ పరిశ్రమ ఒక కన్నతల్లిని కోల్పోయినంతగా శోకసంద్రంలో మునిగిపోయింది.

## ఆరు దశాబ్దాల ప్రస్థానం

1957లో ఒక తమిళ చిత్రం ద్వారా గాయనిగా వెండితెరకు పరిచయమైన జానకి ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. దాదాపు 60 ఏళ్లకు పైగా సాగిన ఆమె సంగీత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు సుమారు 17 భాషల్లో 48వేల పైగా పాటలను ఆలపించి రికార్డు సృష్టించారు. భాష ఏదైనా, భావాన్ని పలికించడంలో ఆమె శైలి అనన్య సామాన్యం. ముఖ్యంగా తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో ఆమె పాడిన పాటలు శ్రోతలను ఎంతగానో ఉర్రూతలూగించాయి. చిన్న పిల్లల గొంతు దగ్గర నుంచి వృద్ధుల గొంతు వరకు ఎలాంటి శబ్దాలనైనా అలవోకగా పలికించగల అద్భుత స్వర విన్యాసం ఆమె సొంతం.

## ఆల్-టైమ్ సూపర్ హిట్ కాంబినేషన్

భారతీయ సినీ సంగీత చరిత్రలో 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం - ఇళయరాజా - ఎస్. జానకి' కాంబినేషన్ ఒక సంచలనం. ఈ ముగ్గురి కలయికలో వచ్చిన పాటలు దక్షిణాది ఇండస్ట్రీలో ఎప్పటికీ నిలిచిపోయే క్లాసిక్స్‌గా మారాయి. ఎస్పీబీతో కలిసి జానకి గారు పాడిన వేలాది యుగళ గీతాలు ప్రేమికులకు అమృతకావ్యాలుగా నిలిచాయి. ఇళయరాజా స్వరకల్పనలో ఆమె పాడిన మెలోడీలు సంగీత ప్రియుల గుండెల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఆమె అద్భుత గాత్రానికి పురస్కారాలు దాసోహమన్నాయి.

ఉత్తమ గాయనిగా 4 సార్లు జాతీయ అవార్డులను దక్కించుకున్న జానకి, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏకంగా 31 సార్లు ఉత్తమ గాయనిగా అవార్డులు అందుకొని రికార్డు సృష్టించారు.

## వ్యక్తిగత జీవితంలో తీరని లోటు

సంగీత ప్రపంచంలో ఎన్నో శిఖరాలను అధిరోహించిన జానకి వ్యక్తిగత జీవితంలో కొన్ని తీవ్ర విషాదాలు ఉన్నాయి. 1997లో ఆమె భర్త వి. రామ్‌ప్రసాద్ గుండెపోటుతో కన్నుమూశారు. ఈ ఏడాది జనవరిలోనే ఆమె ఏకైక కుమారుడు మురళీకృష్ణ కూడా తుదిశ్వాస విడిచారు.

కొడుకు మరణించిన కొద్ది నెలలకే జానకి కూడా అనంత లోకాలకు తరలిపోవడం అభిమానుల గుండెలను పిండేస్తోంది. ఆమె భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె పాడిన వేలాది పాటల రూపంలో జానకి గారి స్వరం ప్రతి ఒక్కరి గుండెల్లో మారుమోగుతూనే ఉంటుంది. జానకి మరణవార్త తెలియగానే ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సినీ ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# విషాదంగా మారిన విహారయాత్ర

పరిస్థితుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఓషన్ పెరల్ ఐలాండ్ కంపెనీకి చెందిన 'ఏజీ-26751' అనే పర్యాటక స్పీడ్ బోటులో భారత పర్యాటకులు సిబ్బందితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫు క్వాక్ దీవి సమీపంలోని హోన్ మే రుట్ న్గోయి ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో, బలమైన గాలులు మరియు అలల ఉద్ధృతికి పడవ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 21 మందిని రక్షించగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఒక మొబైల్ కంపెనీ తరఫున సుమారు 250 మంది డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం పర్యటనకు వెళ్లారు. వీరిలో ఆంధ్రప్రదేశ్?కు చెందిన వారు 35 మంది, తెలంగాణకు చెందిన వారు 40 మంది ఉన్నారు. మృతుల్లో మచిలీపట్నంకు చెందిన డిస్ట్రిబ్యూటర్ గిల్లి కిశోర్ భార్య జయశ్రీ, కడపకు చెందిన ముడియం శ్రీధర్ ఉన్నట్లు గుర్తించారు. గిల్లి కిశోర్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం.
కడపకు చెందిన నయీమ్ అనే డిస్ట్రిబ్యూటర్ ఆ బోటు ఎక్కకపోవడంతో తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మొత్తం ఐదు బోట్లలో పర్యాటకులు విహారానికి వెళ్లగా, అందులో ఒక బోటు ప్రమాదానికి గురైంది. ఈ విషాద ఘటనపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం తక్షణమే స్పందించింది. ప్రమాదాన్ని ధ్రువీకరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన కార్యాలయం, సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొంది. బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు హో చి మిన్ సిటీ, హనోయ్‌లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను (084 36 281 7930, 084 91 552 37 14, 084 33 452 0414, 084 91 308 9165) కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

# పల్లి పల్లి మినిస్టర్

పారిశ్రామిక వర్గాల నుంచి విశేష గౌరవాన్ని అందుకుంది.

## - 50కి పైగా కంపెనీలతో కీలక చర్చలు

ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్ 50కి పైగా కార్పొరేట్ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఎల్జీ, హ్యుందాయ్, శాంసంగ్, బీఎన్‌కే ఫైనాన్షియల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. ముఖ్యంగా ఎల్జీ సంస్థ తమ ప్రధాన కార్యాలయానికి లోకేశ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి, ఉన్నత స్థాయి బృందంతో గౌరవ విందు ఇవ్వడం ఈ పర్యటనకు లభించిన ప్రాధాన్యతను చాటుతోంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పారదర్శక పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై లోకేశ్ ఇచ్చిన ప్రజెంటేషన్‌కు కొరియన్ కంపెనీల నుంచి అద్భుత స్పందన లభించింది. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తమ ఉన్నత యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయా సంస్థలు హామీ ఇచ్చాయి.

## బుసాన్‌లో 'అపెక్స్-కొరియా' సెల్ ప్రారంభం

పెట్టుబడిదారులకు మరింత చేరువయ్యేందుకు, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కొరియాలోని ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్‌లో మంత్రి లోకేశ్ 'అపెక్స్-కొరియా' (ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్-కొరియా) కేంద్రాన్ని ప్రారంభించారు. ఏపీఈడీబీ ఆధ్వర్యంలో పనిచేసే ఈ ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ సెల్, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకునే కొరియన్ కంపెనీలకు ఒక వారధిగా పనిచేస్తుంది. ఇప్పటికే శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో 40కి పైగా కొరియన్ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తుండగా, ఈ కొత్త కేంద్రం ఏర్పాటుతో మరిన్ని కంపెనీలు రాష్ట్రానికి వచ్చేందుకు మార్గం సుగమమైంది. పర్యటన ప్రారంభంలో సియోల్‌లోని భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో భేటీ అయిన లోకేశ్, కొరియాలోని కీలక పరిశ్రమలను ఏపీకి తీసుకురావడంలో చొరవ చూపాలని కోరారు.

## 'పల్లి పల్లి' మినిస్టర్ అంటూ ప్రశంసలు

ఆంధ్రప్రదేశ్‌లో 'కియా' మోటార్స్ కేవలం రెండేళ్లలో సాధించిన అసాధారణ విజయాన్ని లోకేశ్ తన ప్రసంగాల్లో ఉదహరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న '3ఎస్' మోడల్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్), వేగవంతమైన అనుమతుల విధానం కొరియన్లను అమితంగా ఆకట్టుకుంది. మంత్రి లోకేశ్ పని వేగాన్ని, చొరవను చూసి ముగ్ధులైన కొరియన్ ప్రతినిధులు ఆయన్ను 'పల్లి.. పల్లి మంత్రి' అని ముద్దుగా పిలుచుకున్నారు. కొరియన్ భాషలో 'పల్లి పల్లి' అంటే 'త్వరగా త్వరగా' అని అర్థం. లోకేశ్ బృందం పర్యటన అద్భుతమని కొరియా వాణిజ్య ప్రోత్సాహక సంస్థ (కోట్రా) దక్షిణాసియా విభాగాధిపతి క్యుంగ్‌హూన్ కిమ్ ఎక్స్ వేదికగా ప్రశంసించారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి

**- ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ సంయుక్త కార్యదర్శి బంగురు రామదాసు**

**అరకులోయ** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రెండు భుజానికి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. ఆయన త్వరగా కోలుకొని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆ దేవుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామని అరకు నియోజకవర్గ జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ సంయుక్త కార్యదర్శి బంగురు రామదాసు అన్నారు అయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పరితపించే ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్ అహర్నిశలు ప్రజల పక్షాన నిలబడే పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు ఎంతో అవసరం అని అన్నారు. ఆయన సంకల్ప బలం, పోరాట పటిమ ముందు ఎలాంటి అనారోగ్యమైనా తలవంచాల్సిందే అన్నారు. శస్త్రచికిత్స నుండి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని, మునుపటి కన్నా రెట్టింపు ఉత్సాహంతో, నూతనోత్తేజంతో తిరిగి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టాలని కోట్లాది మంది అభిమానులు, జనసైనికులు ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని అన్నారు..

దశాబ్ద కాలానికి పైగా తీవ్రమైన భుజం నొప్పిని భరిస్తూనే ప్రజాసేవను జనసేన పార్టీ సిద్ధాంతాల సాధనను తన ధ్యేయంగా కొనసాగించిన వారి అంకిత భావం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయం అన్నారు.. దేవుని ఆశీస్సులతో పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొంది, మంచి ఆయురారోగ్యాలతో ప్రజలకు మరింత కాలం తన అమూల్యమైన సేవలందించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామన్నారు.

# బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి

**ఎమ్మిగనూరు** నందవరం మండల కేంద్రంలో నిర్వహించిన భారత రాజ్యాంగ శిల్పి, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవంలో ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ఘనంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందవరం మండలంలోని గ్రామ ప్రజలు, యువత ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు.

ముందుగా మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి భారీ ర్యాలీలో పాల్గొంటూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక కార్యక్రమాల నడుమ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, సభలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్త మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం, సమానత్వం, విద్య మరియు అణగారిన వర్గాల సాధికారతకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడని, అందరివాడని కొనియాడారు. రాజ్యాంగం ప్రతి భారతీయుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించే శక్తివంతమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. యువత అంబేద్కర్ గారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యను ఆయుధంగా చేసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి మరియు ప్రతి వర్గం సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, డాక్టర్ అంబేద్కర్ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణ దిశగా ప్రజలందరూ కలిసి ముందుకు సాగాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారు ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో నందవరం మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మరియు సభ్యులు, అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, ఏఎంసీ చైర్మన్, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్, మార్కెట్ యార్డు డైరెక్టర్, డిసేబుల్డ్ వెల్ఫేర్ ఉ మల్లెల ట్రస్ట్ అధినేత, టీడీపీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, నందవరం మండలం మరియు వివిధ గ్రామాల ఎస్సీ యువకులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవా భావం, భక్తి భావంతో ఘనంగా ఎన్‌సీ సంతోష్ జన్మదిన వేడుకలు

**మొక్కల నాటడం నుంచి విద్యార్థులకు ఎల్ఈడీ టీవీ బహూకరణ వరకు పలు సేవా కార్యక్రమాలు**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీఆర్ఎస్ నాయకుడు, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్ జన్మదిన వేడుకలను శనివారం సేవా భావం, భక్తి భావంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను చేపట్టి ఆయన జన్మదినాన్ని ప్రత్యేకంగా జరుపుకున్నారు. ముందుగా ద్వారకా వెంచర్‌లో మొక్కలు నాటి నేమింగ్ బోర్డులను ప్రారంభించారు. అనంతరం అంగడిపేట శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. తదుపరి ఆర్అండ్ఆర్ కాలనీ ఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా ఒక ఎల్ఈడీ టీవీని బహూకరించారు. అలాగే చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. స్థానిక కోర్టుకు కూలింగ్ వాటర్ డిస్పెన్సర్‌ను అందజేసి సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్, అయ్యప్ప దేవాలయం ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ మాట్లాడుతూ, ఎన్‌సీ సంతోష్ తన జన్మదినాన్ని వినూత్నంగా సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆయన తాత రాజయ్య రాజకీయ స్ఫూర్తిని, తండ్రి ఎన్‌సీ రాజమౌళి అడుగుజాడలను అనుసరిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఎన్‌సీ సంతోష్ మరిన్ని పుట్టినరోజులను ఇలాంటి సేవా కార్యక్రమాల మధ్య జరుపుకుంటూ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫర్ యూ అసోసియేషన్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవి క్లబ్ సభ్యులు, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ప్రతినిధులు, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో వాహన తనిఖీల్లో బైక్ దొంగ అరెస్ట్

**మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

**గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ పోలీసుల వాహన తనిఖీల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితుడు సంపంగి రాజేష్ (29), తండ్రి పోచయ్య, వడ్డెర కులానికి చెందినవాడు. డ్రైవర్‌గా పనిచేస్తూ మెడ్చల్ జిల్లా షమీర్‌పేట్‌లోని హనుమాన్ టెంపుల్ కాలనీలో నివాసం ఉంటున్నాడు.పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాల్లో హీరో స్ప్లెండర్ ప్లస్ (ఏపీ 28 బి ఎస్ 4572), హీరో ప్యాషన్ ప్లస్ (ఏపీ 09 ఎ ఎస్ 1665), హీరో స్ప్లెండర్ ప్లస్ (ఏపీ 24 ఏపీ 8643) ఉన్నాయి. ఈ వాహనాలకు సంబంధించిన కేసులు షమీర్‌పేట్, గజ్వేల్ పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయి.పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడు గత మూడు సంవత్సరాలుగా గజ్వేల్, షామీర్‌పేట్ పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 8న ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుంచి ఓ బైక్‌ను దొంగిలించి, దానిని విక్రయించేందుకు జూలై 11న గజ్వేల్‌కు తీసుకువచ్చాడు.అదే సమయంలో ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద గజ్వేల్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో నిందితుడు చిక్కాడు. విచారణలో తాను చేసిన దొంగతనాలను అంగీకరించడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా కోర్టు అతడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపింది.నిందితుడిని పట్టుకుని కేసును ఛేదించిన గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, క్రైమ్ సిబ్బందిని గజ్వేల్ ఏసీపీ నర్సింలు అభినందించారు.

# నిజాలతోనే ఎదురుదాడి

**గొడ్డలి పార్టీ దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టండి**

**టీడీపీ ముఖ్యనేతలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం**



అమరావతి (ప్రశ్న న్యూస్) సోషల్ మీడియాను వేదికగా చేసుకుని దుష్ప్రచారం, విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్న "గొడ్డలి పార్టీ" ప్రయత్నాలను వాస్తవాలతోనే సమర్థవంతంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లడంతో పాటు అసత్య ప్రచారాన్ని ఆధారాలతో ఖండించాలని సూచించారు.
శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు తాజా రాజకీయ పరిణామాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం, పార్టీ బలోపేతం, సంక్షేమ కార్యక్రమాల ప్రచారంపై విస్తృతంగా చర్చించారు.దుష్ప్రచారంపై అప్రమత్తం కావాలిసమావేశంలో పలువురు నేతలు సోషల్ మీడియా వేదికగా గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దేశాన్ని, హిందూ మతాన్ని కించపరిచినట్లు, మహిళలను మోసం చేశారనే ఆరోపణలతో అరెస్టయిన యూట్యూబర్ బచ్చులకూరి జోసఫ్‌కు గొడ్డలి పార్టీ మద్దతుగా నిలిచిందని కూడా ప్రస్తావించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, అసత్య ప్రచారాన్ని నిజాలతో తిప్పికొట్టాలని, ప్రజలకు వాస్తవాలు చేరితే దుష్ప్రచారం నిలవదని పేర్కొన్నారు.ప్రజలు అన్నీ గమనిస్తున్నారు

# రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టాడు

- 117 సీట్లు గెలిపించుకునే ప్లాన్ రేవంత్ రెడీ చేశాడు - రేవంత్ వ్యూహాలు, నిర్ణయాలకు మా మద్దతు ఉంటుంది
- రేవంత్ ఆలోచనలతో మాకు ఏకాభిప్రాయం ఉంటుంది - సీట్లు ఎవరికి ఇవ్వాలనే అంశం సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ నిర్ణయాన్ని బట్టి ఉంటుంది
- అధిష్ఠానం హరీష్ పై పోటీ చేయమంటే సిద్ధమే - నేను సంగారెడ్డిలో పోటీ చేయనన్నాను కానీ వేరే దగ్గర పోటీ చేయనని చెప్పలేదు
- పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి



**హైద్రాబాద్ జులై 11** :రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టాడు117 సీట్లు గెలిపించుకునే ప్లాన్ రేవంత్ రెడీ చేశాడురేవంత్ వ్యూహాలు, నిర్ణయాలకు మా మద్దతు రేవంత్ ఆలోచనలతో మాకు ఏకాభిప్రాయం ఉంటుందని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి తెలిపారు.శనివారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ సీట్లు ఎవరికి ఇవ్వాలనే అంశం సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ నిర్ణయాన్ని బట్టి ఉంటుందిఇంత ముందు ఎన్నికల గురించి ఆలోచించడం సరైన ఆలోచనేరెండవ సారి ప్రభుత్వం తెచ్చేందుకు నిర్ణయాలు తీసుకునే హక్కు రేవంత్ కి ఉందన్నారు.ఎవరి సర్వేలు వారికి అనుకూలంగా చేస్తారుసర్వేలను చూసి టెన్షన్ పడాల్సిన అవసరం లేదుఎమ్మెల్యేల పనితీరు దృష్టిలో పెట్టుకునే సీఎం పలువురికి సూచనలు ఇస్తున్నారునేను సంగారెడ్డిలో పోటీ చేయను అన్నానువేరే దగ్గర పోటీ చేయనని చెప్పలేదన్నారు.సంగారెడ్డి నియోజకవర్గం లేడీ ఉన్నా, జనరల్ ఉన్నా నిర్మలనే క్యాండేట్ సీఎం సూచనలతో ఎమ్మెల్యేలు అలెర్ట్ అవుతున్నారుసీఎం చెప్పడంతో పలువురు ఎమ్మెల్యేలు తమ తీరు మార్చుకుంటున్నారుసీఎం చెప్పిన తర్వాత కూడా తీరు మారకపోతే సీటు ఇవ్వాలో లేదో సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ నిర్ణయం తీసుకుంటారన్నారు. అపోజిషన్ ఎప్పుడూ రూలింగ్ పార్టీని ఎటాక్ చేస్తుందిరాజకీయ నీతి కూడా అదేకేసీఆర్ మొదటిసారి సీఎం అయినప్పుడు కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని సర్వేలు చెప్పాయియాక్టివ్ లేని వాళ్ళని సీఎం రేవంత్ అలెర్ట్ చేస్తున్నారుఅలెర్ట్ చేసిన తర్వాత కూడా తీరు మార్చకపోతే వేటు తప్పదుమేమే తోపులు అంటే నడవదుపెద్ద పెద్ద తోపులను కూడా పక్కన పెట్టిన సందర్భాలు ఉన్నాయిసిట్టింగ్ ఎమ్మెల్యే తోపు కాదు సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ మాత్రమే తోపులురాజకీయాల్లో పర్మినెంట్ గా ఎవరూ తోపులు ఉండరన్నారు.అధిష్ఠానం హరీష్ పై పోటీ చేయమంటే సిద్ధమే అధిష్ఠానం సిద్దిపేటలో పోటీ చేయమంటే తప్పకుండా చేస్తానన్నారు

# జిల్లాలో యూరియా కొరత లేదు

- ప్రతి రైతుకు, ప్రతి పొలానికి అవసరమైనంత యూరియా అందుబాటులో ఉంది
- గతేడాదితో పోలిస్తే రెట్టింపు యూరియా విక్రయాలు
- 54,805 మంది రైతులు ఇప్పటికే యూరియా కొనుగోలు
- ఫెర్టిలైజర్ సప్లై యాప్‌తో పారదర్శక సరఫరా
- స్మార్ట్‌ఫోన్ లేని రైతులకు రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యేక సహాయం



**మచిలీపట్నం: జూలై 11, 2026** జిల్లాలో యూరియా కొరతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకు, ప్రతి మడికి, ప్రతి పొలానికి అవసరమైనంత యూరియాను అందించే బాధ్యతను ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వర్తిస్తోందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన యూరియా లభ్యత, సరఫరా వ్యవస్థపై వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళన చెందవద్దని తెలిపారు. గత ఏడాది జూన్ నెలాఖరు నాటికి జిల్లాలో 4,732 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని, ఈ ఏడాది అదే కాలానికి ఇప్పటికే 10,088 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించామని తెలిపారు. గతేడాదితో పోలిస్తే దాదాపు రెట్టింపు స్థాయిలో యూరియా పంపిణీ జరిగిందని చెప్పారు.ఇప్పటివరకు జిల్లాలో 54,805 మంది రైతులు యూరియాను కొనుగోలు చేశారని, జిల్లాలో తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు అవసరానికి మించి ముందుగానే కొనుగోలు చేయకుండా, అందరికీ సమానంగా యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఫెర్టిలైజర్ సప్లై యాప్‌ను అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ యాప్ అమలుకు రాష్ట్రంలో కృష్ణా, కాకినాడ జిల్లాలను పైలట్ జిల్లాలుగా ఎంపిక చేశారని చెప్పారు. కొత్త వ్యవస్థ ప్రారంభంలో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురైనా, వాటిని వెంటనే కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం యూరియా సరఫరా ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, అప్పుడప్పుడు సర్వర్ నెమ్మదించడం వంటి స్వల్ప సమస్యలు మినహా ఎలాంటి ఇబ్బందులు లేవని వివరించారు.స్మార్ట్‌ఫోన్ లేని రైతులు కూడా ఇబ్బంది పడకుండా ప్రతి రైతు సేవా కేంద్రంలో ప్రత్యేక సహాయ కేంద్రాలు (హెల్ప్‌డెస్క్‌లు) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతుల తరఫున యాప్‌లో బుకింగ్ చేయించే ఏర్పాట్లు చేశామని, రైతుల సొంత మొబైల్ లేదా అందుబాటులో ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారా కూడా నమోదు చేసే అవకాశం కల్పించామని చెప్పారు. స్మార్ట్‌ఫోన్ లేకపోవడం లేదా నిరక్షరాస్యత కారణంగా ఏ రైతుకూ యూరియా అందక ఇబ్బంది పడిన ఘటన తమ దృష్టికి రాలేదన్నారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి జ్యోతి రామణి, మార్క్‌ఫెడ్ డిఎం మురళీ కిషోర్, అగ్రికల్చర్ ఆఫీసర్ శాంతి పాల్గొన్నారు.

# రామమందిరంలో చోరీలకు నిరసనగా " వీహెచ్" మౌనదీక్ష "

**- సంఘీభావం ప్రకటించిన ఎమ్మెల్యేలు కవ్వంపల్లి, ఆది శ్రీనివాస్**

**రాజన్న సిరిసిల్ల** అయోధ్య రామమందిరం విరాళాల చోరీ వ్యవహారానికి కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యతవహించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు శనివారం మౌన దీక్ష చేపట్టారు. ఇల్లంతకుంట మండలం రామోజీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వీహెచ్ మౌన దీక్షకు పూనుకోగా, ఆయన దీక్షకు మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రాముడి పేరుతో భక్తుల నుంచి వసూలు చేసిన కోట్లాది రూపాయల విరాళాలు స్వాహా కావడం, భక్తితో ఇచ్చిన కానుకలను దొంగిలించడం వల్ల భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్ని విమర్శించారు. రామనామాన్ని నిత్యం స్మరించే కమలనాథులు రామ మందిరంలో జరిగిన చోరీలపై చోద్యం చూడటం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. రామ మందిరం అనేది కోట్లాది హిందువుల ఆత్మగౌరవానికి, విశ్వాసానికి సంబంధించిన అంశమని, అలాంటి పవిత్ర కార్యక్రమంలో జరిగిన భారీ అవినీతిని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం దాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మతాలకు, విశ్వాసాలకు వ్యతిరేకం కాదని, మతం పేరుతో జరిగే దోపిడీని, మోసాన్ని కాంగ్రెస్ పార్టీ సహించబోదని డాక్టర్ కవ్వంపల్లి స్పష్టం చేశారు. రాముడి పేరును రాజకీయాలకు, దోపిడీకి ఉపయోగించడం కమలనాథులకు క్షంతవ్యం కాదని ఆయన పేర్కొన్నారు. కేంద్రం వెంటనే స్పందించి విరాళాల లెక్కలను బహిర్గతం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాముడు సత్యానికి, ధర్మానికి ప్రతీక అని, ఆయన పేరుతో అక్రమాలు చేస్తే ప్రజలు సహించరని స్పష్టం చేశారు.. ఈ దీక్ష ద్వారా కేంద్రానికి కనువిప్పు కలిగించాలన్నదే తమ ఉద్దేశం" అని అన్నారు. కోట్లాది మంది భక్తులు అత్యంత పవిత్రమైనదిగా భావించే అయోధ్య రామమందిరంలో నిధుల చౌర్యం వ్యవహారం భక్తులను కలవరపర్చిందన్నారు. ఏళ్ల తరబడి



నిరీక్షణకు తెరదించుతూ 2024 జనవరిలో అయోధ్య రామమందిరం ప్రారంభం కాగా, కేవలం రెండున్నర ఏళ్లలోనే ఈ విధమైన ఘటనలు చోటుచేసుకోవడం భక్తులనుగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. దోషులకు శిక్ష పడాల్సిందేనన్నారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు వూట్కూరి వెంకటరమణారెడ్డి, గడ్డం నర్సయ్య, అలువాల కోటి, పసుల వెంకటి,తోపాటు వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, పార్టీ గ్రామశాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వియత్నాంలో బోటు ప్రమాదం..

కడప, బందర్‌కు చెందిన పలువురు లావా మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు కంపెనీ తరఫున వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీప పర్యటనకు వెళ్లారు. అక్కడ జరిగిన బోటు ప్రమాదంలో పలువురు మృతి చెందగా.. అందులో కడపకు చెందిన నక్షత్ర మొబైల్స్ దుకాణ యజమాని, డిస్ట్రిబ్యూటర్ మొడియం శ్రీధర్ మృతి చెందారు. ఈ ఘటనపై ఇప్పటికే కుటుంబసభ్యులకు మొబైల్ డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీ సమాచారం ఇచ్చింది. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు

## ఫేక్ డిగ్రీలు.. 3 వేల మంది టీచర్ల తొలగింపు

బీహార్ లో నకిలీ సర్టిఫికేట్లు, ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా ఉద్యోగాలు పొందిన దాదాపు 3 వేల మంది ఉపాధ్యాయులను విధుల్లోంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 2006 నుంచి 2015 మధ్య కాలంలో జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై విజిలెన్స్ బ్యూరో సుదీర్ఘ దర్యాప్తు చేపట్టింది. విజిలెన్స్ అధికారులు సమర్పించిన సమగ్ర నివేదిక ఆధారంగానే ప్రభుత్వం ఈ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోంది. కేవలం ఉద్యోగాల నుంచి తొలగించడమే కాకుండా, సదరు ఉపాధ్యాయులపై చట్టపరమైన చర్యలు కూడా ప్రారంభించింది. ఇప్పటికే ఈ స్కామ్తో సంబంధం ఉన్న పలువురిపై ఎఫ్ఐఆర్ (ఈఎఫ్ఐ) నమోదు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.తప్పు చేసిన వారెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అధికారులు హెచ్చరిస్తున్నారు.మరోవైపు, అక్రమ మార్గాల్లో ఉద్యోగాలు సంపాదించి, ఇన్నేళ్లుగా ప్రభుత్వ ఖజానా నుంచి వారు పొందిన జీతాలు, గౌరవ వేతనాలను వదిలేయకూడదని ప్రభుత్వం భావిస్తోంది. ఇంతకాలం వారు తీసుకున్న వేతన సొమ్ము మొత్తాన్ని వడ్డీతో సహా రికవరీ చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయం విద్యాశాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

# యాటపాక నవోదయ విద్యాలయ ఆరవ తరగతి ప్రవేశపరీక్షకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి

**రంపచోడవరం** పోలవరం జిల్లాలోని యాటపాక నవోదయ విద్యాలయ ఆరవ తరగతి ప్రవేశపరీక్షకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని అర్హులైన విద్యార్థులను పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు.దశనివారం పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో యాటపాక లో జవహర్ నవోదయ విద్యాలయంలో ఆన్లైన్ ద్వారా ఆరో తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరడం జరిగిందని ఆయన తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఫీజులు లేకుండా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధృవపత్రం, ఫోటోలు, విద్యార్థి సంతకం, తల్లిదండ్రుల సంతకాలు అదేవిధంగా వికలాంగులైనచో వికలాంగ ధ్రువపత్రాలు సమర్పించాలని ఆయన అన్నారు.ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల జూలై 31 వ తారీకు లోపు దరఖాస్తులు సమర్పించుకోవచ్చని ఆయన తెలిపారు.

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ సంవత్సరం నవంబర్ 28 తారీకు శనివారం ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన అన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉండాలని ఆయన అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అభ్యర్థులకు యన్ వి యస్ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ ద్వారా సీట్లు కేటాయించడం జరుగుతుందని ఆయన అన్నారు. పోలవరం జిల్లాలోని విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గడువు తేదీలోపు దరఖాస్తులు సమర్పించుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి మరిన్ని వివరాల కోసం సమీప పాఠశాలలోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఇంచార్జ్ బి. వి. శ్రీనివాస రావు, మండల విద్య శాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని ఆయన అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్ సైట్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

## గిరిజన గురుకుల కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు.



మంథని ( ప్రశ్న న్యూస్) పెద్దపల్లి జిల్లా మంథని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు)లో ఎంపీసీలో 10 అడ్మిషన్లు ఖాళీగా ఉన్నాయని, గిరిజన తెగకు చెందిన బాలికలు వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపల్. డాక్టర్ కె భవాని ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలను అందిస్తున్న ఈ కళాశాలలో టిసి తో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో బుధవారం రోజునస్పాట్ అడ్మిషన్ కు హాజరుకావాలని తెలిపారు.

## మంథని మాతా శిష్యును మంత్రి మర్చిపోయారా...

- మంథని మాత శిశు ఆసుపత్రిలో నిరసన.
- గైనకాలజిస్ట్ డాక్టర్ ను నియమించాలి.
- కార్పొరేట్ వైద్యానికి అలవాటు పడ్డ మీకు పేద ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయి.
- బి ఆర్ ఎస్ మహిళలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.
- మంథని మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ.





మంథని ( ప్రశ్న న్యూస్) మంథని నియోజకవర్గం బిఆరెస్ పార్టీ మహిళ విభాగం ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఇంతకు ముందు ఆసుపత్రి ని సందర్శించి... సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు.గత కొన్ని నెలలుగా మాత శిశు ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడం బాధాకరమని అన్నారు.మంథని మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ మాట్లాడుతూ...మంత్రి శ్రీధర్ బాబు కు నియోజకవర్గంలో మాత శిశు ఆసుపత్రిలో గైనకాజిస్ట్ డాక్టర్ లేకపోవడం ఆవేదన వ్యక్తం చేశారు..2014 నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ కా ఎన్ని డెలివరి లు అయ్యాయో తాము శ్వేతా పత్రం విడుదల చేస్తాము. అని ఇప్పుడు ఉన్న ప్రభుత్వం ఎంత మందికి డెలివరీ లు చేసారో శ్వేతా పత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.గత కొన్ని నెలలుగా మాత ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడం బాధాకరమని అన్నారు. అతి త్వరలో మాత శిశు ఆసుపత్రి లో గైనకాజిస్టు ను నియమించాక పోతే దీక్ష చెప్పటాతామని... అన్నారు.నిరసన వద్దకు మంథని పోలీస్ లు చేరుకొని నిరసనను సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.గైనకాజిస్టు డాక్టర్ ను నియమించే వరకు విరమించమని చెప్పడంతో... మంథని ప్రభుత్వ ఆసుపత్రి సూపర్ డెంట్ రాజ శేఖర్ రెడ్డి పెద్దపల్లి జిల్లా డిఎంఎచ్ఓ తో ఫోన్ లో మాట్లాడించగా డాక్టర్ త్వరలో నియమిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరంపజేశారు.

## మంజూరైన అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా (ప్రశ్నన్యూస్ )కుషాయిగూడ వార్డు-16 పరిధిలో రూ. 2.30 కోట్ల(రెండు కోట్ల ముప్పై లక్షలు)వ్యయంతో మంజూరు చేసిన బీటీ రోడ్ల బలోపేతం, దెబ్బతిన్న రోడ్ల రీకార్పెటింగ్ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మారుతి ఎన్‌క్లేవ్‌లోని రోడ్డు నంబర్-1 నుండి రోడ్డు నంబర్-13 వరకు, జీహెచ్ఎంసీ ఫ్రీడమ్ పార్క్ నుంచి పోచమ్మ దేవాలయం వరకు, వైష్ణవి ఎన్‌క్లేవ్ అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులపై స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే చర్చించారు.రోడ్ల పరిస్థితి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకొని,పనులు నాణ్యతతో, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని,ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా రాకపోకలు సులభతరం చేయడమే ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్ , సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, డప్పు గిరి బాబు, బొడిగే రాజు, కడియాల బాబు, కొల నరేష్, వేణుగోపాల్ రెడ్డి, జైకృష్ణ, సంపత్, శేఖర్, బాలాజీ, కోటి రెడ్డి, సుభాష్, రెడ్డి నాయక్ కాలనీ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, కాలనీ వాసులు నవీన్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి శివ శంకేర్ గౌడ్, సంతోష్ రెడ్డి, నాగార్జున, జై పాల్ రెడ్డి, రాజేశ్వర్ గుప్త, వీరాబద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320-హెచ్ ఆధ్వర్యంలో 50 డయాబెటిస్ డిటెక్షన్ కిట్ల పంపిణీ



కాప్రా (ప్రశ్న న్యూస్ )లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320-హెచ్ గ్లోబల్ కాజెస్ విభాగం ఆధ్వర్యంలో కుషాయిగూడ లయన్స్ భవన్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న లయన్స్ క్లబ్‌లకు 50 డయాబెటిస్ డిటెక్షన్ కిట్లు పంపిణీ చేశారు. ప్రతి క్లబ్ తమ పరిధిలో మధుమేహ నిర్ధారణ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ లయన్ అశోక్ కుమార్ స్వైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా లయన్ డి. లింగా రెడ్డి, ఎమ్‌జేఎఫ్ ప్రథమ వైస్ జిల్లా గవర్నర లయన్ మనోహర్ రెడ్డి, పీఎంజేఎఫ్ జిల్లా ముఖ్య సలహాదారు లయన్ కొత్త రామారావుఎమ్‌జేఎఫ్ చైర్మన్, కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ హాస్పిటల్ ప్రత్యేక ఆహ్వానితురాలిగాడాక్టర్ ఎన్. దేవి సుష్మ హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి లయన్ కొత్తపల్లి రాంబాబు, పీఎంజేఎఫ్, జిల్లా కార్యదర్శి గ్లోబల్ కాజెస్ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా లయన్ కొత్తపల్లి రాంబాబు మాట్లాడుతూ, ప్రతి లయన్స్ క్లబ్ తమ పరిధిలో డయాబెటిస్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మధుమేహాన్ని ముందుగానే గుర్తించేందుకు ఈ డిటెక్షన్ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల్లో మధుమేహంపై అవగాహన పెంపొందించడం, ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.ముఖ్య అతిథి జిల్లా గవర్నర్ లయన్ అశోక్ కుమార్ స్వైన్ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ జిల్లా 320-హెచ్‌లో అత్యంత సీనియర్, సేవా దృక్పథం కలిగిన క్లబ్‌లలో ఒకటిగా కొనియాడారు. లయన్ కొత్త రామారావు నాయకత్వంలో గత 25 సంవత్సరాలుగా కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ హాస్పిటల్ ద్వారా అందిస్తున్న విశిష్ట సేవలను ప్రశంసించారు.ట్రస్ట్ హాస్పిటల్ అభివృద్ధికి విశేష కృషి చేసిన లయన్ రియాజ్ అహ్మద్ ఖాన్, లయన్ చంద్రశేఖర్, లయన్ పిల్లి, లయన్ రవిశంకర్ రాజులను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కార్యదర్శి గ్లోబల్ కాజెస్‌గా లయన్ కొత్తపల్లి రాంబాబు తన బాధ్యతలను ఎంతో నిబద్ధతతో నిర్వహిస్తూ, జిల్లా స్థాయిలో చక్కటి సేవా కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నందుకు ఆయనను అభినందించారు. ఇదే ఉత్సాహం, అంకితభావం, సేవా స్ఫూర్తితో లయనిస్టిక్ సంవత్సరం మొత్తం కొనసాగాలని ఆకాంక్షించారు. లయన్ కొత్త రామారావు మాట్లాడుతూ, కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ హాస్పిటల్ గత 25 సంవత్సరాలుగా నిరుపేదలకు నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలను అందిస్తోందని, భవిష్యత్తులో మరిన్ని వైద్య సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.లయన్ మనోహర్ రెడ్డి తన ప్రసంగంలో నూతన లయన్ సభ్యులను సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని లయనిజం ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పీడీజీ లయన్ లింగా రెడ్డి, లయన్ జైపాల్ రెడ్డి (డీసీటీ), లయన్ కమలాకర్ (డీసీసీ), లయన్ బాలచందర్ చందర్ గౌడ్ (జీఎస్‌టీ కోఆర్డినేటర్), లయన్ తారకేష్, లయన్ చి. వెంకట రామరాజు, లయన్ ఎం. మోహన్, వివిధ క్లబ్‌లకు చెందిన రీజినల్ చైర్మన్లు, జోన్ చైర్మన్లు, క్లబ్ పదాధికారులు లయన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా ముగియగా, జిల్లా వ్యాప్తంగా మధుమేహ నియంత్రణ, ముందస్తు నిర్ధారణ ప్రజారోగ్య పరిరక్షణలో లయన్స్ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

### ఏటూరునగరంలో బీజేపీ ఆధ్వర్యంలో కేక్ కట్, సంబరాలు



ఏటూరునగరం(ప్రశ్న న్యూస్)కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ అన్న జన్మదినాన్ని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఏటూరునగరం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు వినుకొల్లు చక్రవర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంజయ్ అన్న చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. అనంతరం టపాసులు, టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ కార్యకర్తలు "భారత్ మాతా కీ జై" నినాదాలతో హోరెత్తించారు. వినుకొల్లు చక్రవర్తి మాట్లాడుతూ బండి సంజయ్ దేశ సేవలో చేస్తున్న కృషి అందరికీ ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు వావిలాల జనార్ధన్, మాజీ ఎంపీటీసీ, సీనియర్ నాయకులు కేరళ ఎల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శులు కర్ణ సంపత్, కందడి ఎలంధర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు యానాల చంద్రారెడ్డి, దుర్గం దుర్గారావు, అటిక నాగేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షులు గాడిచర్ల రాజశేఖర్, మండల నాయకులు ఎర్నవడ్ల జగన్, నరాల రవి, బొల్లె శ్రీను, గడ్డం శ్రీధర్, బూత్ అధ్యక్షులు అటిక కృష్ణ, మండల యువ నాయకులు దుర్గం శ్రావణ్, కొండగొర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## జగదేవ్‌పూర్ పోలీసుల దాడిలో 80 గ్రాముల గంజాయి స్వాధీనం

### - ఇద్దరు అరెస్ట్, మరో ఇద్దరు పరారీ, గంజాయి, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం - గజ్వేల్ ఏసిపి నర్సింలు



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో పోలీసులు శనివారం నిర్వహించిన ఆకస్మిక దాడిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పోలీసులను గమనించి అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితులు నెల రోజుల క్రితం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళ్లి ఓ అపరిచిత వ్యక్తి వద్ద రూ.10 వేల చెల్లించి 100 చిన్న గంజాయి ప్యాకెట్లను కొనుగోలు చేశారు. వాటిని తమలో తాము పంచుకుని కొంత వినియోగించడంతో పాటు, మిగిలిన ప్యాకెట్లను జగదేవ్‌పూర్, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో ఒక్కో ప్యాకెట్‌ను రూ.500 చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నారు. శనివారం జగదేవ్‌పూర్ సబ్‌స్టేషన్ సమీపంలో చింతకింది అజయ్ కుమార్, రెల శేఖర్‌లు గజ్వేల్‌కు చెందిన చక్రి అనే వ్యక్తికి 10 గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తుండగా పోలీసులు దాడి నిర్వహించారు. పోలీసులను చూసి చక్రి తన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్‌ను అక్కడే వదిలి పరారయ్యాడు. మరో నిందితుడు రాయవరం రాజు కూడా తప్పించుకున్నాడు. పోలీసులు అజయ్ కుమార్, శేఖర్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

**అరెస్టైన నిందితులు:** చింతకింది అజయ్ కుమార్ (20), తండ్రి బాలనర్సయ్య, జగదేవ్‌పూర్.
రెల శేఖర్ (25), తండ్రి బాలయ్య, పెర్లపల్లి గ్రామం, జగదేవ్‌పూర్ మండలం.

**పరారీలో ఉన్నవారు:** రాయవరం రాజు (జగదేవ్‌పూర్)
చక్రి (గజ్వేల్)

**స్వాధీనం చేసుకున్నవి:** 80 గ్రాముల గంజాయి
రెండు సెల్‌ఫోన్లు (నోకియా, లావా)
హోండా యాక్టివా (TS-36-వీ-1365)
రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్ (టా-23-జు-1147)

ఈ సందర్భంగా జగదేవ్‌పూర్ పోలీసులు గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి, కానిస్టేబుళ్లు లింగం, బాలకిషన్‌లను ఏసీపీ నర్సింలు అభినందించారు.

## అగ్రవర్ణాల పాలనకు చరమగీతం పాడాలి

### బీసీలే రాజ్యాధికారం సాధించాలి -తుప్పతి బిక్షపతి



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అగ్రవర్ణాల ఆధిపత్య పాలన కొనసాగుతోందని, ఆ పరిస్థితికి చరమగీతం పాడి బీసీలు రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా ముందుకు సాగాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు తుప్పతి బిక్షపతి పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జూలై 5న భువనగిరిలో నిర్వహించిన మహాసభ ఘనవిజయం సాధించడం బీసీ సమాజంలో పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. సామాజిక న్యాయం, బీసీల రాజకీయ సాధికారత లక్ష్యంగా కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తెలంగాణ రాజ్యాధికార పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీల హక్కులు, రాజ్యాధికారం కోసం పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తుందని బిక్షపతి తెలిపారు. ఈ మీడియా సమావేశంలో పార్టీ జిల్లా, మండల, యువజన, రైతు విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆల్విన్ కాలనీ బీజేపీ అధ్యక్షుడిగా రాజు నియామకం



కూకట్ పల్లి(ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ శేర్లింగంపల్లి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షుడి గా చిన్నగాలోల రాజును అధిష్టానం నియమించింది. శుక్రవారం బీజేపీ పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనివల్లి శ్రీనివాస్ రెడ్డి రాజు కి నియామక పత్రం అందజేసి అయన మాట్లాడుతూ రాజు లాంటి యువనాయకులు డివిజన్ లోని పార్టీ నాయకులతో కలిసి మెలిసి పని చేస్తూ రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో డివిజన్ లో బీజేపీ జెండా ఎగరవేయాలని తెలిపారు. పార్టీ లో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందని వివరించారు.అధ్యక్షుడు గా నియమక పత్రం అందుకున్న అనంతరం రాజు మాటాడుతూ తన పై నమ్మకం ఉంచి పార్టీ ఇచ్చిన బాధ్యతను అప్పగించినందుకు అధిష్టనానికి ధన్యవాదములు తెలిపి,తప్పకుండ నెరవేర్చి డివిజన్ లో బీజేపీ జెండా ఎగరడవేసేలా కృషి చేస్తానని తెలిపారు

## పల్లి.. పల్లి దౌత్యం

### కొరియాలో లోకేష్ పెట్టుబడుల పరుగు, 50కి పైగా కంపెనీలతో చర్చలు

### భారత్, కొరియా సంబంధాలకు కొత్త ఊపు..

### ఏపీ పెట్టుబడి గమ్యంగా అంతర్జాతీయ సంస్థల దృష్టి



సియోల్ (ప్రశ్న న్యూస్) రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన వారంరోజుల సౌత్ కొరియా అధికారిక పర్యటన విజయవంతంగా ముగిసింది. పెట్టుబడుల ఆకర్షణతో పాటు భారత్--దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సాగిన ఈ పర్యటనలో 50కి పైగా ప్రముఖ కొరియన్ కంపెనీలతో మంత్రి లోకేష్ విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కార్పొరేట్ దిగ్గజాలను ఆహ్వానించారు.దక్షిణ కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం మేరకు ఈ నెల 5 నుంచి 11 వరకు జరిగిన పర్యటనలో ఎల్జీ, హ్యుందయ్, శాంసంగ్, బీఎన్‌కే ఫైనాన్షియల్ వంటి ప్రముఖ సంస్థల ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పారిశ్రామిక విధానాలు, మౌలిక వసతులు, పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించగా, ఆయా సంస్థలు రాష్ట్ర ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చాయి.పర్యటనలో మరో కీలక ఘట్టంగా బుసాన్‌లో ఏపీఈడీబీ ఆధ్వర్యంలో 'ఏపెక్స్--కొరియా' పెట్టుబడిదారుల అనుసంధాన కేంద్రాన్ని ప్రారంభించారు.

### సైకోలను పెంచేది జగన్..

# సమాజాన్ని కాపాడేది కూటమి

**- 'ప్రశ్న రావణ్' వ్యవహారంపై పట్టాభిరామ్ తీవ్ర విమర్శలు**




మంగళగిరి(ప్రశ్న న్యూస్) సోషల్ మీడియా వేదికగా విద్వేషాలను రెచ్చగొట్టే వ్యక్తులకు వైఎస్సార్సీపీ అండగా నిలుస్తోందని, సమాజంలో మత విద్వేషాలు సృష్టించే శక్తులను ప్రోత్సహిస్తోందని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.'ప్రశ్న రావణ్' పేరుతో గుర్తింపు పొందిన వ్యక్తి దేశభక్తి, హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీశాయని అన్నారు. అలాంటి వ్యక్తికి వైఎస్సార్సీపీ బహిరంగ మద్దతు ఇవ్వడం బాధాకరమని విమర్శించారు. దేశ సార్వభౌమాధికారానికి విఘాతం కలిగించే చర్యలను ఎవరూ సమర్థించరాదని స్పష్టం చేశారు.ప్రశ్న రావణ్‌కు న్యాయపరమైన సహాయం అందించేందుకు వైఎస్సార్సీపీ అధినేత వ్యక్తిగత న్యాయవాదిని కోర్టుకు పంపించారని పట్టాభిరామ్ ఆరోపించారు. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని సమర్థించడం సమంజసం కాదన్నారు.వైఎస్సార్సీపీ సోషల్ మీడియా ద్వారా విద్వేషాలను ప్రోత్సహిస్తోందని, ప్రత్యేక శిక్షణా శిబిరాల ద్వారా మానసికంగా రెచ్చగొట్టే వ్యక్తులను తయారు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ తరహా చర్యలు సమాజానికి ప్రమాదకరమని పేర్కొన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. మత, కుల విభేదాలకు తావులేకుండా అందరి మనోభావాలను గౌరవించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ భద్రత, సామాజిక సామరస్యానికి భంగం కలిగించే చర్యలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, వాటిని చూసి ఓర్వలేక కొందరు అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని పట్టాభిరామ్ ఆరోపించారు. గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు తర్వాత కూడా వైఎస్సార్సీపీ తీరు మారలేదని విమర్శించారు.

# శ్రీకాకుళం అభివృద్ధే లక్ష్యం

**- పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి**

**- పొట్టి శ్రీరాములు మార్కెట్ ఆధునికరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి: మంత్రి అచ్చెన్నాయుడు**



నిమ్మాడ(ప్రశ్న న్యూస్) శ్రీకాకుళం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. ఇటీవల శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి. శ్రావణ్ కుమార్ శనివారం నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, నగర ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరుస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్ ఆధునీకరణకు ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు, సాంకేతిక నమూనాలు, వ్యయ అంచనాలతో కూడిన ప్రణాళికను త్వరగా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని కమిషనర్‌కు సూచించారు.నగరాభివృద్ధి కార్యక్రమాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం నగరాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# కేజీబీవీ ఘటనపై అచ్చెన్న ఆగ్రహం

**- విద్యార్థుల అస్వస్థతపై సమగ్ర విచారణకు ఆదేశం**

**- బాధ్యుల పై సస్పెన్షన్‌కు కలెక్టర్‌కు సూచన**



శ్రీకాకుళం(ప్రశ్న న్యూస్) గార మండలం శాలిగుండం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో శనివారం ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, పూర్తి వివరాలు తెలుసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు.విద్యార్థులు పౌష్టికాహారం తీసుకున్న అనంతరం అస్వస్థతకు గురయ్యారనే ఆరోపణల నేపథ్యంలో మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించేందుకు కట్టుబడి ఉందని, ఇలాంటి ఘటనల్లో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.ఈ ఘటనకు బాధ్యులైన అధికారులను, సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మంత్రి ఆదేశించారు. ఈ విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.అనంతరం సమగ్ర శిక్ష అధికారులతోనూ మంత్రి ఫోన్‌లో మాట్లాడి, పాఠశాలలో అందిస్తున్న భోజన వసతి, ఆహార నాణ్యత, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాధిత విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం రాజీ పడదని, విధుల్లో అలసత్వం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## సైకోలకు ఆయుధాలు తోడు, క్షణాల్లో ప్రాణాలు గాల్లో

# షాబాద్ లో ఆరుగురిని పొట్టన పెట్టుకున్న రాజ్ కుమార్

- "6"ని చంపిన నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి "2"లక్షల రివార్డ్ ప్రకటించి పోలీసులు
- సిక్స్ మెంబెర్స్ ని హత్య చేసిన సైకో ని గ్రామ ప్రజలకు అప్పగించాలని డిమాండ్
- అమాయక ప్రాణాలను తీసినవాన్ని వదిలే ప్రసక్తే లేదంటున్న గ్రామ పెద్దలు
- స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య తో ప్రజలు వాగ్వివాదం
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులు నిర్లక్ష్యం పై కఠిన చర్యలు
- సిఐ ని సస్పెండ్ చేసిన కలెక్టర్






నిందితుని కారు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అభం శుభం తెలియని ఓ చిన్నారిని(మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడడం, ఫోక్స్ కేసు నమోదు)బలవంతం చేసిన కేసులో షాబాద్ కి చెందిన రాజ్ కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు షాబాద్ పోలీసులు.ఈ కేసులో మే "16"వ తేదీన ఫోక్స్ కేసులో బాధిత బాలిక తల్లి ఫిర్యాదు చేయగా,మే "26"వ తారీఖున రిమాండ్ కు తరలించిన పోలీసులు. అయితే ఇక్కడే అసలు విషయం దాగి ఉన్నట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు. వాస్తవానికి ఉన్నత న్యాయస్థానం నుంచి "అంటీ స్పెక్టర్"తో బెయిల్ మంజూరు.ఈ కేసు విషయంలో సిఐ,ఎస్సైలు సరైన ఆధారాలు సేకరించలేదని స్థానిక ఆరోపణలు.తర్వతబెయిల్ మంజూరు కావడంతో మొన్న గురువారం రాత్రి సుమారు 11 గంటలకు ఆ చిన్నారి వల్ల ఫోక్స్ కేసు నమోదు కావడమే కాకుండా తన పరువు పోయిందని భావించిన రాజ్ కుమార్ గురువారం రాత్రి ఆ బాధితురాలు ఇంటికి వెళ్ళితనతో తెచ్చుకున్న పదునైన కత్తితో తల్లి,నానమ్మ న్నీ అతి కిరాతకంగా హత్య చేశాడు.అనంతరం ఇంటి నుంచి ఆ బాలికను పొలంలోకి తీసుకువెళ్ళి హత్యాచారం చేసి ఆమెను కూడా కిరాతకంగా హత్య చేసిన ఉన్మాది.అసలు ఈ హత్యలన్నింటికి కారణం షాబాద్ పోలీసులేనని స్థానికులు పేర్కొంటున్నారు.కేవలం ఇరవై వేల రూపాయల పూచీ కత్తితో "2"నెలల్లోనే బెయిల్ రావడం తో,అమాయకులైన రెండు కుటుంబాల్లో ఆరు మందిని అతి కిరాతకంగా హతమార్చిన రాజ్ కుమార్.తన భార్య పిల్లలు అని కూడా చూడ కుండా సతీమణి సరితను తనపిల్లలను కూడా హతమార్చిన ఉన్మాది.

### దైవలాగూడలో "6"మంది హత్య తీవ్ర కలకలం రేపింది:

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో దైవలాగూడలో ఆరుగురిని హత్యకు గురైన విషయం గ్రామస్తులకు తెలియడంతో ఊర్లో తీవ్ర కలకలం రేపింది.బాధిత కుటుంబ సభ్యులు షాబాద్–షాద్నగర్ ప్రధాన రహదారిపై దాదాపు మూడు గంటల పాటు ఆందోళన కొనసాగించారు.దీంతో షాబాద్ నుండి సర్దార్ నగర్, ఎల్లికట్టు వరకు,మరో వైపు నాగర్ గూడ వరకు సుమారు పన్నెండు కిలో మీటర్లు మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.పోక్స్ కేసులో పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దారుణానికి ఒడిగట్టాడు అని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు.నిందితులపైగతంలో వచ్చిన ఫిర్యాదు పై పోలీసులు సకాలంలో చర్యలు తీసుకుని ఉంటే ఇంత పెద్ద దారుణం చోటుచేసుకునేదే కాదని వారు ఆవేదన వ్యక్తంచేశారు.అదిగాక నిందితుడు హత్య చేసి గంటలు గడుస్తున్నప్పటికి పోలీసులు సెల్ఫోన్ సిగ్నల్ ఎందుకు ట్రేస్ చేయలేదని ప్రశ్నించారు.ఈదారుణానికి పూర్తి బాధ్యత ఖాకీలే బాధ్యత వహించాలని వారి నిర్లక్ష్యానికి ఆరు మంది బలైపోయారని కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు గో బ్యాక్ అంటూ నినాదాలతో హోరెత్తించారు.అలాగే రహదారి పై సుమారు మూడు,నాలుగు గంటల పాటు రోడ్డు పై బైఠాయించారు.చనిపోయినబాధిత కుటుంబంలో మరోక బాలిక "వికలాంగురాలిగా"ఉందన్న విషయాన్ని ప్రపంచానికి గుర్తు చేశారు.కలెక్టర్ రావాలి ఆ పసి తల్లికి అండగా ఉండడమే కాకుండా ఎక్స్గ్రేషియా సర్కార్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి:

షాబాద్ మండలంలో దైవలాగూడలో ఆరుగురు హత్యకు గురయ్యారు.నిందితుడు రాజ్ కుమార్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,అలాగే ఈ కేసుని నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు.బాధిత కుటుంబ సభ్యులు ఒకరైన అంగవైకల్యురాలు కి ప్రభుత్వం తరపున సహాయంగా ఐదు లక్షల రూపాయలు అందజేస్తామని,ఆమెకు సర్కార్ నుంచి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడంతో పాటు జీవనోపాధిని కల్పిస్తామని కలెక్టర్ నారాయణ రెడ్డి హామీ ఇచ్చారు.

### షాబాద్ హత్య కేసులో సిఐ క్రాంతి రెడ్డి సస్పెన్షన్:

షాబాద్ మండలంలో దైవలాగూడలో గురువారం రాత్రి 11 గంటలకు ఫోక్స్ కేసులో నిందితుడిగా ఉన్న రాజ్ కుమార్ ఆరుగురిని అతి కిరాతకంగా హత్య చేశాడు."6"మందిని దారుణ హత్యల కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన షాబాద్ పోలీస్ స్టేషన్ సిఐక్రాంతి రెడ్డి ని సిపి తరుణ్ జోషి సస్పెండ్ చేశారు.ధైర్యంగా షాబాద్ పోలీస్ స్టేషన్ కి వచ్చి మైనర్‌బాలిక ఫిర్యాదు చేసినప్పటికీ నిందితుడు రాజ్ కుమార్ పై ఫోక్స్ కేసు నమోదు చేసి అరెస్టు చేయకపోవడాన్ని బాధితుల కుటుంబ సభ్యులు తీవ్రంగా తప్పుపట్టారు.గ్రామస్థులు పోలీసులే నిందితుడికి సహకరించారని ఆరోపించడంతో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు సిఐ పై చర్యలు తీసుకున్నారు.

# హరీష్ రావు కేసీఆర్ తీర్చిదిద్దిన సైనికుడు

**- రేవంతే శీలపరీక్ష చేసుకోవాలి**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్మీట్‌లో ఆయన మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నికవ్వడం ఒక కలేనని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి స్వయంగా చేయించుకున్న అంతర్గత సర్వేలోనే బీఆర్ఎస్‌కు 78 సీట్లు వస్తాయని తేలిందని, ఒకవేళ తాను సర్వే చేయించుకోలేదని రేవంత్ భావిస్తే దేవుడిపై ఒట్టేసి చెప్పాలని సవాల్ విసిరారు. రేవంత్‌కు తన పాలనపై, నమ్మకంపై అంత ధైర్యం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేల స్థానాల్లో ఉపఎన్నికలకు వెళ్లాలని, లేదా స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలని, అదీ కాదంటే వెంటనే అసెంబ్లీని రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు రావాలని కేటీఆర్ సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డికి సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన లేదని, ఆయన కేవలం సంచులలో పైసలు నింపి ఢిల్లీకి కట్టే 'ఈఎంఐ' ముఖ్యమంత్రి అంటూ తీవ్రంగా ఎద్దేవా చేశారు.

**- తెలంగాణపై రేవంత్ పగ..**

**మేడిగడ్డతో లింకు పెట్టి దారి మళ్లింపు!**

గోదావరి బేసిన్‌లో లక్షలాది క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలోకి పారుతున్నా, రేవంత్ రెడ్డి తన మూర్ఖత్వంతో, గత ప్రభుత్వంపై ఉన్న ద్వేషంతో తెలంగాణ రైతాంగంపై పగబట్టారని కేటీఆర్ ఆరోపించారు. క్షేత్రస్థాయిలో మేడిగడ్డ బ్యారేజీతో ఎలాంటి సంబంధం లేకుండానే, కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా కేవలం ఒక్క బటన్ నొక్కి రోజుకు ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందన్నారు. కన్నెపల్లి దగ్గర నదీ ప్రవాహం 97 మీటర్లకు చేరిన తరుణంలో నీటిని ఎత్తిపోస్తే రానున్న 100 రోజుల్లో 200 టీఎంసీలను నింపి మిడ్ మానేరు, లోయర్ మానేరు, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ వంటి రిజర్వాయర్లను నింపవచ్చని రిటైర్డ్ ఇంజనీర్లు సైతం లేఖ రాశారని గుర్తుచేశారు. కానీ, ముఖ్యమంత్రి మేడిగడ్డ బ్యారేజీ కూలిపోతుందనే నెపంతో ప్రజలను మభ్యపెడుతూ, బోడిగుండుకూ మోకాలికీ ముడివేస్తూ నీటిని కిందికి వదిలేస్తున్నారని మండిపడ్డారు.

**- తెలంగాణను ఎండబెట్టి..**

**పక్క రాష్ట్రానికి గురు దక్షిణ**

తాము కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శించి అక్కడ నీటి లభ్యతను ప్రజలకు చూపించడంతోనే రేవంత్ రెడ్డి బండారం బయటపడిందని, అందుకే ఆయన పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఒకవైపు తెలంగాణ రైతులు సాగునీరు లేక అల్లాడుతుంటే, రేవంత్ రెడ్డి మాత్రం తన పాత గురువుకు గురుదక్షిణ ఇచ్చుకోవడానికి నీళ్లన్నీ కిందికి వదిలేస్తూ రైతు ద్రోహి గా మారుతున్నారని ధ్వజమెత్తారు. కన్నెపల్లి దగ్గర నీళ్లు లేకపోతే, మరి కిందికి పోతున్న ఆ నీటితోనే పొరుగు రాష్ట్రంలోని పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా వందల టీఎంసీలను ఎలా ఎత్తిపోసుకుంటున్నారో రేవంత్ సమాధానం చెప్పాలన్నారు.

మేడిగడ్డకు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న భద్రాచలం మునిగిపోతుందంటూ రేవంత్ దారుణమైన అబద్ధాలు చెప్తున్నారని, భద్రాచలానికి ముప్పు పొంచి ఉన్నది పోలవరం ప్రాజెక్టు వల్లే తప్ప కాళేశ్వరంతో కాదని, కానీ తన గురువుపై కోపం వస్తుందనే భయంతో రేవంత్ పోలవరంపై మాట్లాడటం లేదని ఆరోపించారు.

**- బుర్ర తక్కువ ముఖ్యమంత్రి..**

**దేవాదులకూ తాళం!**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎత్తు ఒక్కటే తక్కువ అనుకుంటే, బుర్ర కూడా తక్కువేనని ఆయన చేష్టల ద్వారా స్పష్టమవుతోందని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కనీసం దేవాదుల ప్రాజెక్టు ఏ బేసిన్‌లో ఉందో కూడా తెలియని వ్యక్తి మనకు ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర దౌర్భాగ్యమన్నారు.

కాళేశ్వరం పంపులకే కాకుండా దేవాదుల పంపులకు కూడా తాళం వేసి వరంగల్ జిల్లా రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు సార్లు రైతు బంధు ఎగ్గొట్టి, రైతు బీమా కట్టకుండా, పంటలు కొనకుండా వేధిస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కాలం తెచ్చిన కరువు కాదు, రేవంత్ రెడ్డి తెచ్చిన కరువుతో రాష్ట్రాన్ని నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వైఖరిని ఇంకో రెండు మూడు వారాలు గమనిస్తామని, అప్పటికీ పంపులు ఆన్ చేసి నీళ్లు ఎత్తిపోయకుంటే రైతాంగాన్ని ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా భారీ కార్యాచరణతో తిరగబడతామని హెచ్చరించారు.

**- హరీష్ రావు ఉద్యమ సైనికుడు.. అర్ధరాత్రి బీజేపీ కాళ్లు పట్టుకునే రేవంత్‌కు సిగ్గుండాలి!**

మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యక్తిగత విమర్శలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. హరీష్ రావు కేసీఆర్ గారితో కలిసి మొదటి నుండి ఉద్యమ జెండా మోసిన క్రమశిక్షణ కలిగిన సైనికుడని కొనియాడారు. హరీష్ రావుపై గతంలోనూ ఎన్నో చిల్లర పుకార్లు వచ్చాయని, వాటిని ఆయన పటాపంచలు చేశారని గుర్తుచేశారు. పొద్దున లేస్తే కాంగ్రెస్ డ్రామాలు ఆడుతూ, అర్ధరాత్రి కాగానే కేసుల భయంతో ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకునే రేవంత్ రెడ్డి లాంటి బ్లాక్‌మెయిలర్ ఇతరుల నిబద్ధతను శంకించడం సిగ్గుచేటని మండిపడ్డారు. దశాబ్దాల పాటు ఒకే పార్టీలో ఉంటూ నిలబడిన నేతలను విమర్శించే నైతిక అర్హత ఓటుకు నోటు కేసులో దొరికిన రేవంత్‌కు లేదని, ఇప్పటికైనా చిల్లర వాగుడు బంద్ చేసి రైతులను ఆదుకోవడంపై దృష్టి పెట్టాలని కేటీఆర్ హితవు పలికారు.

# ‘డోస్’ మూవీ రివ్యూ!



శుక్రవారం వచ్చిందనగానే ఓటీటీ లవర్స్ అంతా కూడా మలయాళం నుంచి ఏమైనా థ్రిల్లర్ సినిమాలు వచ్చాయేమోనని తప్పకుండా సెర్చ్ చేస్తారు. అందుకు కారణం ఈ జోనర్ నుంచి వచ్చే మలయాళ సినిమాలు ఒక రేంజ్ లో ఆకట్టుకుంటాయనే నమ్మకం. అలాంటి ఆడియన్స్ ఆసక్తికి తగినట్టుగానే ఈ శుక్రవారం ( జులై 10)వ తేదీన ఒక సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా పేరే ‘డోస్’. సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్ లో రూపొందిన ఈ సినిమా, ‘అమెజాన్ ప్రైమ్’తో పాటు లైన్స్ గేట్ ప్లే .. ‘ఆహా’లోను అందుబాటులో ఉంది. ప్రకాశ్ (సిజూ విల్సన్) ఒక కార్పొరేట్ హాస్పిటల్లో డాక్టర్ గా పనిచేస్తుంటాడు. అతని భార్య దివ్య ( కృషా కురూప్) అనారోగ్యంతో బాధపడుతూ ఉంటుంది. ఆమె అంటే అతనికి చాలా ఇష్టం. అందువలన ఆమె కోసం హాస్పిటల్ కి అందుబాటులోనే అతను నివసిస్తూ ఉంటాడు. అదే హాస్పిటల్లో అరుంధతి (దృశ్య రఘునాథ్) పనిచేస్తూ ఉంటుంది. చాలా కేసులు ఆమెనే డీల్ చేస్తూ ఉంటుంది. ఆమె భర్త ‘పీటర్’ మీడియాలో వర్క్ చేస్తుంటాడు. గతంలో ప్రకాశ్ .. అరుంధతి ప్రేమించుకుంటారు. అయితే కొన్ని కారణాల వలన ఆమెను ప్రకాశ్ పెళ్లి చేసుకోలేకపోతాడు. గర్భవతి అయిన తనని వదిలేసి వెళ్లిన అతనిపై అరుంధతి కోపంగా ఉంటుంది. ఇద్దరూ మాట్లాడుకోపోయినప్పటికీ, ఒకే హాస్పిటల్లో పనిచేస్తుంటారు. అక్కడే జూనియర్ డాక్టర్ గా ‘నిఖిల్’ పనిచేస్తుంటాడు. ఆ హాస్పిటల్ కి ‘సీఈఓ’ గా ఉన్న గోపీనాథ్ ( జగదీశ్) కూతురు ‘అభిరామి’ని అతను ప్రేమిస్తూ ఉంటాడు. అయితే నిఖిల్ ధోరణి నచ్చని కారణంగా అభిరామి అతనికి దూరంగా ఉంటుంది. కొన్ని రోజులుగా ప్రకాశ్ చాలా డిప్రెషన్ లో ఉంటాడు. ఎందుకంటే తను టేకప్ చేసిన కేసులన్నీ ఫెయిల్ అవుతుంటాయి. పేషంట్లు ఒకరి తరువాత ఒకరిగా చనిపోతుంటారు. తనపై గల కోపంతో అరుంధతినే ఇలా చేస్తుందనే అనుమానం అతనికి కలుగుతుంది. ఫలితంగా ఈ కేసును పరిష్కరించడానికి పోలీస్ ఆఫీసర్ వివేక్ (అశ్విన్ కుమార్) రంగంలోకి దిగుతాడు. అతని ఇన్వెస్టిగేషన్ లో ఎలాంటి నిజాలు బయటపడతాయి? నేరస్థులు ఎవరు? అనేది మిగతా కథ. ఈ కథ చాలావరకూ హాస్పిటల్ చుట్టూ తిరుగుతుంది. హాస్పిటల్లోని రోగులు అనుమానాస్పదంగా చనిపోతుంటారు. ఆ మరణాలవెనుక ఎవరున్నారు? అందుకు గల కారణాలు ఎలాంటివి? ఏ కేసును పరిష్కరించడానికి రంగంలోకి దిగిన పోలీస్ ఆఫీసర్ వివేక్ ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుంది? అనేది ఈ కథలోని ప్రధానమైన అంశం. మెడికల్ మాఫియా .. మెడికల్ థ్రిల్లర్ నేపథ్యంలో అడపాదడపా సినిమాలు వస్తూనే ఉన్నాయి. ఒక మెడిసిన్ ను టెస్ట్ చేయడం కోసం .. హాస్పిటల్ కి వచ్చిన అమాయక కుటుంబాలను టార్గెట్ చేయడం వంటి కథలు గతంలో వచ్చాయి. అయితే అందుకు భిన్నమైన ఒక కథతో రూపొందినదిగా ‘డోస్’ కనిపిస్తుంది. ఇద్దరు డాక్టర్ల మధ్య ప్రేమ వ్యవహారం, వారి వృత్తిపై ఎలాంటి ప్రభావం చూపించిందనేది ఈ కథలోని సారాంశం. ఈ కథ మొదలైన మొదటి అరగంట వరకూ, ఏం జరుగుతుందనేది మనకి అర్థం కాదు. ఆ తరువాతనే ఒక్కో విషయం ప్రేక్షకులకు అర్థమవుతూ ఉంటుంది. హీరో అనుమానాలు .. అన్వేషణలతో ఫస్టు పార్టు, అందుకు సంబంధించిన పోలీస్ ఆఫీసర్ ఇన్వెస్టిగేషన్ తో సెకండ్ పార్టు సాగుతాయి. ఆడియన్స్ కూడా తమకి తెలియకుండానే ఇన్వెస్టిగేట్ చేయడం మొదలుపెడతారు. వాళ్ల సందేహాలు నర్సులు .. జూనియర్ డాక్టర్ల చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ఇలాంటి కథలలో నేరస్థులు ఎవరనేది ఎలాంటి పరిస్థితులలో ఆడియన్స్ గెస్ చేయకూడదు. గెస్ చేశారంటే ఆ కథ .. స్క్రీన్ ప్లే చాలా బలహీనంగా అల్లుకోవడం జరిగిందని అర్థం చేసుకోవాలి. ఈ కథలో కూడా కొన్ని పాత్రలపైకి అనుమానాలు వెళతాయి. అయితే కావాలని ఆడియన్స్ దృష్టిని అటు వైపు తీసుకెళ్లినట్టుగా అనిపించదు.

ఆ తతంగం చాలా సహజంగా జరిగిపోతుంది. ఇక అసలైన నేరస్థులు ఎవరనేది కూడా దర్శకుడు చెప్పేంత వరకూ చాలామంది కనుక్కోలేరు. ఈ కథలో సస్పెన్స్ ఉంది .. మిస్టరీ ఉంది. సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్లోనే నడుస్తుంది. అయితే సాధ్యమైనంత వరకూ సహజత్వానికి దగ్గరగా చూపించడానికి ప్రయత్నించారు. ఎలాంటి హడావిడి లేకుండా సింపుల్ గా జరిగిన ఈ ఆవిష్కరణ కొంతవరకూ ప్లస్ అయితే, మరికొంతవరకూ మైనస్ అయిందని కూడా చెప్పుకోవచ్చు. నటీనటుల నటన గురించి చెప్పుకునేంత స్థాయిలో పాత్రలను మలచలేదు. విష్ణుప్రసాద్ ఫొటోగ్రఫీ .. గోపీసుందర్ నేపథ్య సంగీతం ఫరవాలేదు. శ్యామ్ శశిధరన్ ఎడిటింగ్ వర్క్ కూడా ఓకే. సహజమైన మలుపులు .. గెస్ చేయలేని ట్విస్ట్ ఈ కథకి ప్రధానమైన బలంగా కనిపిస్తాయి అంతే.

## ఉత్కంఠతకు గురిచేసే సూపర్‌హీరో బాబు



అర్జున్ దాస్, శాండీ మాస్టర్ ప్రధానపాత్రల్లో నటించిన ద్విభాషాచిత్రం ‘సూపర్ హీరో బాబు’. విఘ్నేష్ వేణుగోపాల్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కేఎస్ సినిష్ నిర్మాత. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని శుక్రవారం విడుదల చేశారు. ఇది సూపర్‌హీరో కథాంశమని టైటిల్‌తోపాటు ఫస్ట్‌లుక్ కూడా చెప్పకనే చెబుతున్నది. ఉత్కంఠతకు గురిచేసే కథ, కథనాలతో ఈ సినిమా సాగుతుందని, అర్జున్‌దాస్, కథానాయిక తేజు అశ్విని, శాండీ మాస్టర్ కాంబినేషన్ సీన్స్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, సమర్పణ: సోల్జర్స్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, నిర్మాణం రెడాక్టడ్ స్టూడియోస్.

## షూటింగ్‌లో గాయపడిన రాశీ ఖన్నా..


## నొప్పిని భరిస్తూనే కీలక షెడ్యూల్ పూర్తి



టాలీవుడ్, బాలీవుడ్‌లో తనదైన గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ రాశీ ఖన్నా షూటింగ్ సందర్భంగా గాయపడిన విషయం అభిమానుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్, నటి విద్యా బాలన్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అనీస్ బజ్మీ తెరకెక్కిస్తున్న భారీ కామెడీ ఎంటర్‌టైనర్‌లో రాశీ ఖన్నా కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ప్రమాదంలో ఆమె గాయపడినప్పటికీ, ధైర్యంగా షూటింగ్ పూర్తి చేయడం విశేషంగా మారింది. తాజాగా ఈ విషయాన్ని రాశీ ఖన్నా స్వయంగా సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంది. యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతున్న సమయంలో గాయపడినట్లు తెలిపిన ఆమె, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ షూటింగ్‌ను మధ్యలో నిలిపివేయలేదని వెల్లడించింది. తన సినీ ప్రయాణంలో ఇదే అత్యంత కఠినమైన షూటింగ్ షెడ్యూల్ అని పేర్కొంది. గాయం కారణంగా తీవ్ర అసౌకర్యం ఎదురైనా, చిత్రబృందం సహకారం, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్లే ఆ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేయగలిగానని రాశీ తెలిపింది. ముఖ్యంగా సహనటులు అక్షయ్ కుమార్, విద్యా బాలన్‌తో పాటు యూనిట్ సభ్యులు తనకు అండగా నిలిచారని ఆమె కృతజ్ఞతలు తెలిపింది. ఈ సినిమాలో ప్రముఖ నటులు సుదేశ్ లెహ్రి, విజయ్ రాజ్ కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే బాలీవుడ్‌లో మంచి అంచనాలు నెలకొన్నాయి. అనీస్ బజ్మీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నవ్వులతో పాటు వినోదాన్ని పంచేలా తెరకెక్కుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. రాశీ ఖన్నా గాయపడిన వార్త తెలిసిన వెంటనే అభిమానులు ఆమె త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, విశ్రాంతి తీసుకుంటూనే మిగిలిన షూటింగ్‌కు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ భారీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. షూటింగ్‌లో ఎదురైన ఇబ్బందులను అధిగమించి తన వృత్తిపట్ల అంకితభావాన్ని చాటుకున్న రాశీ ఖన్నాపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.


## ప్రమోషనల్ పోస్ట్‌కు పదిలక్షలు?

సినిమాల పరంగా విజయాలు తక్కువే అయినా అచ్చ తెలుగందం శ్రీలీల క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. అందుకు యూత్‌లో ఈ భామకున్న ఫాలోయింగ్‌ను కారణంగా చెప్పొచ్చు. చూడముచ్చటైన రూపలావణ్యం, చలాకీ నటనతో ఈ భామ కుర్రకారులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో ఈ సొగసరి సినిమాల కంటే సోషల్‌మీడియా ద్వారానే భారీగా డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిసింది. శ్రీలీల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 17 మిలియన్ల ఫాలోవర్స్ ఉన్నారు. ఈ వేదికలో ఒక్క ప్రమోషనల్ పోస్ట్‌కు ఆమె 5 నుంచి 10 లక్షల వరకు ఛార్జ్ చేస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా నెలరోజుల్లో దాదాపు 50 లక్షల వరకు ఈ భామ ఆర్జిస్తున్నదని ఇండస్ట్రీ ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నది. సోషల్‌మీడియాలో బ్రాండ్ కొలాబరేషన్స్ ద్వారా పెద్ద మొత్తంలో ఆర్జిస్తున్న కథానాయికల్లో శ్రీలీల ఒకరని చెబుతున్నారు. మరి ఈ వార్తల్లో నిజమెంతో తెలియదు కానీ.. ట్రేడ్ వర్గాల్లో మాత్రం బాగా ప్రచారమవుతున్నది.



## కనకరాజు వచ్చేది ఆ రోజే!

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న ‘కొరియన్ కనకరాజు’ చిత్రాన్ని ఆగస్ట్ 7న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇండియన్–కొరియన్ కల్చర్ కలబోతగా హారర్ కామెడీతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మాతలు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో వరుణ్‌తేజ్ ఓ చేతిలో కత్తి, మరో చేతిలో గ్రెనేడ్ పట్టుకొని రఫ్ అండ్ అల్ట్రాస్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. కొరియన్ గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ కథలో వరుణ్‌తేజ్ పాత్ర కొత్త పంథాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, రచన–దర్శకత్వం: మేర్లపాక గాంధీ.



## మళ్లీ పుట్టే ప్రేమ ‘శ్రీశ్రీ’



మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్ సినిమాలతో వరుసగా వందకోట్ల విజయాలను తెలుగులో అందుకున్న మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్.. మరో స్ట్రయిట్ ప్రేమకథతో మళ్లీ తెలుగు ప్రేక్షకుల్ని పలకరించబోతున్నారు. ఈ చిత్రం ద్వారా రవి నెలకుదిటి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. పూజా హెగ్డే కథానాయిక. శ్రీలక్ష్మీవెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. శుక్రవారం నిర్మాతలు ఈ సినిమా టైటిల్‌తోపాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఈ సినిమాకు ‘శ్రీశ్రీ’ అనే ఆహ్లాదకరమైన టైటిల్‌ని ఖరారు చేశారు. ‘లవ్ విల్ స్పార్క్ అగైన్’ అనేది ఉపశీర్షిక. కాంపౌండ్ వాల్‌పై కూర్చుని సరదాగా కబుర్లాడుకుంటున్న దుల్కర్ సల్మాన్, పూజాహెగ్డేలను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. బ్లూ షర్ట్, గ్రే ట్రౌజర్, కళ్లద్దాలతో చిరునవ్వులు చిందిస్తూ దుల్కర్ కనిపిస్తే, లైట్ బ్లూ సల్వార్ సూట్‌లో అతని వైపు చూసి మనసారా నవ్వుతూ పూజా హెగ్డే కనిపిస్తున్నది. ఇద్దరూ క్లాస్‌మేట్స్ అని పోస్టర్ చెబుతున్నది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ ప్రేమకథకి కెమెరా: అనయ్ ఓం గోస్వామి, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, సహనిర్మాత: ఇషాన్ సక్సేనా.

## కార్మిక ఐక్యతకు జేఏసీ.. సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాట

- విద్యుత్ కేంద్రం కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్లపై ఉమ్మడి పోరాటం..
- జంపాల సీతారామయ్యకు గౌరవ అధ్యక్ష బాధ్యతలు



**ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్)** డాక్టర్ నార్ల తాతారావు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి వివిధ కార్మిక సంఘాలు ఐక్య వేదికను ఏర్పాటు చేశాయి. కార్మికుల హక్కుల సాధన, పెండింగ్ డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)ని ఏర్పాటు చేసి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జంపాల సీతారామయ్యను గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జంపాల సీతారామయ్యకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అన్ని సంఘాలు రాజకీయాలకు అతీతంగా ఒక్కటిగా రావడం అభినందనీయమని అన్నారు. జేఏసీ ఐక్యంగా ఉద్యమిస్తే సమస్యల పరిష్కారానికి మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జంపాల సీతారామయ్య హామీ ఇచ్చారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం కోసం పలు చర్యలు చేపట్టిందని గుర్తుచేస్తూ, ప్రస్తుతం కూడా కార్మికులకు న్యాయం జరిగేలా ప్రయత్నిస్తామని తెలిపారు. జేఏసీ ఏర్పాటులో తెలుగు నాడు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం, ఏపీ పవర్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, వైఎస్సార్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం సహా పలు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఐక్య కార్యాచరణతో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పోరాటం చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో స్వతంత్ర కుమార్, దుర్గారావు, మహేష్, మురళి, ప్రసాద్, పవన్ కుమార్, శేఖర్ రెడ్డి, పురుషోత్తం, బాబి, సురేష్ కుమార్, మల్లికార్జునరావు, శాంతి కుమార్, సంషేర్ వలి, నాగేశ్వరరావుతో పాటు పెద్ద సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## పవన్ త్వరగా కోలుకోవాలి

- శస్త్రచికిత్స విజయవంతం కావడంపై హర్షం :మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి(ప్రశ్న న్యూస్)** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ముంబయిలో నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తికావడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యుల సూచన మేరకు కొద్ది రోజుల పాటు విశ్రాంతి తీసుకోనున్నారని శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం శ్రమించే అంకితభావం కలిగిన నాయకుడని పేర్కొన్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన పూర్తిస్థాయిలో కోలుకుని త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి తిరిగి వచ్చి ప్రజాసేవను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లోకి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండాలనే తపన పవన్ కళ్యాణ్ సొంతమని, శారీరక ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడిగా ఆయనను కొనియాడారు. కోట్లాది మంది ప్రజల ఆశీస్సులు, అభిమానుల ప్రార్థనలు ఆయనకు అండగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఉప ముఖ్యమంత్రి కీలక పాత్ర పోషిస్తున్నారని, విశ్రాంతి అనంతరం మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో పాల్గొంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ఆయన ఆలోచన, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

### కృత్తికా నక్షత్రం సందర్భంగా

## సుబ్రహ్మణ్యస్వామికి విశేషాభిషేకం

- లోకక్షేమం కోసం ప్రత్యేక సంకల్పం, భక్తిశ్రద్ధలతో పూజలు



**శ్రీశైలం(ప్రశ్న న్యూస్ )**కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైలం దేవస్థానంలోని ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి శనివారం విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. దేవస్థానం సేవలో భాగంగా ప్రతి మంగళవారం, కృత్తికా నక్షత్రం, షష్ఠి తిథి సందర్భంగా నిర్వహించే ఈ విశేషారాధనలో అర్చకులు వేదోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా దేశంలో శాంతి, సుభిక్షం నెలకొనాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని, ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా ఉండాలని అర్చకులు ప్రత్యేక సంకల్పం చేశారు. అనంతరం మహాగణపతి పూజ నిర్వహించి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకం, అర్చన, సుబ్రహ్మణ్య స్తోత్ర పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీరు, వివిధ పండ్ల రసాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. ముఖ్యంగా పండ్ల రసాలతో చేసే అభిషేకానికి విశేష ఫలితం ఉంటుందని ఆగమ శాస్త్రాలు పేర్కొంటున్నాయని అర్చకులు తెలిపారు. శ్రీ సుబ్రహ్మణ్యస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే ఉద్యోగ, వ్యాపార, ఇతర వ్యవహారాల్లో ఎదురయ్యే ఆటంకాలు తొలగడంతో పాటు శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టిదోషాలు నివారిస్తాయని విశ్వాసం. అలాగే సంతానప్రాప్తి కోసం పూజలు చేసే దంపతులకు స్వామివారి అనుగ్రహంతో సంతాన భాగ్యం కలుగుతుందని భక్తులు నమ్ముతారని దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ విశేష పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆశీస్సులు పొందారు.

# పిల్లలే సంపదకు శ్రీకారం

- జనాభా సంరక్షణే రాష్ట్ర భవిష్యత్తు: సీఎం చంద్రబాబు - మైక్రో కుటుంబాలు కాదు, ఉమ్మడి కుటుంబాలే ఆదర్శం
- ఫెర్టిలిటీ రేటు పెరగాల్సిన అవసరం, క్షేమం'తో వృద్ధులకు అండ



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** జనాభా నియంత్రణ విధానాల నుంచి జనాభా సంరక్షణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, భవిష్యత్తులో 'పిల్లలే సంపద' అనే కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని వెల్లడించారు. అభివృద్ధికి మానవ వనరులే ప్రధాన బలమని, జనాభా తగ్గుదల రానున్న కాలంలో తీవ్రమైన సవాల్‌గా మారుతుందని పేర్కొన్నారు. గతంలో జనాభా నియంత్రణ అవసరమనే దృష్టితో ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయని, ఇద్దరికిపైగా పిల్లలు ఉన్న వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో అనర్హత వంటి నిబంధనలు కూడా అమల్లోకి వచ్చాయని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, జనాభా పెంపు, ఫెర్టిలిటీ రేటు వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రపంచంలోని 40కి పైగా దేశాలు జనాభా తగ్గుదల సమస్యను ఎదుర్కొంటున్నాయని, దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలు, పాఠశాలల్లో చిన్నారుల సంఖ్య తగ్గుతుండగా, వృద్ధుల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి వంద మందిలో 89 శాతం మందికి రెండో సంతానం లేకపోవడం భవిష్యత్తుకు హెచ్చరిక అని వ్యాఖ్యానించారు. మహిళల విద్య, సాధికారత, ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, పిల్లల పెంపకం మహిళల ఒక్కరి బాధ్యత కాదని, కుటుంబం మొత్తం బాధ్యతగా భావించాలని సీఎం అన్నారు. మైక్రో కుటుంబాల కంటే భారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థే సమాజానికి బలమని, అదే భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి యువత నైపుణ్యం, వృద్ధుల అనుభవం రెండూ అవసరమని చెప్పిన సీఎం, వృద్ధుల సంక్షేమం కోసం త్వరలో 'క్షేమం' పేరుతో ప్రత్యేక కార్యక్రమం తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇప్పటికే 'సంజీవని' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియా దుర్వినియోగం యువతలో మానసిక సమస్యలకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, విలువలతో కూడిన జీవన విధానం, సాంకేతిక పరిజ్ఞానం, ఆధ్యాత్మికత కలిసినప్పుడే సమాజం ముందుకు సాగుతుందని అన్నారు. టెక్నాలజీని బాధ్యతాయుతంగా వినియోగించాలని యువతకు సూచించారు. 2047 నాటికి రాష్ట్ర తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు చేర్చడం ప్రభుత్వ లక్ష్యమని, 2040 నాటికే స్వర్ణాంధ్ర సాధనకు అవసరమైన మానవ వనరులు రాష్ట్రంలో ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమం ముగింపులో పాపులేషన్ మేనేజ్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ పత్రాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గన్ కాదు... పుస్తకమే సమాజాన్ని మారుస్తుంది

- తెలుగు భాష, మహిళల గౌరవ పరిరక్షణ అందరి బాధ్యత: హోంమంత్రి వంగలపూడి అనిత



విజయవాడ(ప్రశ్న న్యూస్)తుపాకి భయాన్ని సృష్టిస్తే, పుస్తకం వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహించిన మూడో అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలు--2026లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాష అనేది కేవలం సంభాషణకు పరిమితమైన భాష కాదని, అది తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయం, ఆత్మీయతకు ప్రతీక అని మంత్రి పేర్కొన్నారు. పిల్లలు ఏ భాషలో మాట్లాడినా ప్రేమ, బాధ, ఆప్యాయత వ్యక్తం చేసే తొలి పదం 'అమ్మ' అని, ఆ ఒక్క పదంలోనే తెలుగు మమకారం అంతా నిక్షిప్తమై ఉందని అన్నారు. 'దివిసీమ గాంధీ'గా పేరొందిన మండలి వెంకట కృష్ణారావు తెలుగు భాషాభివృద్ధికి, ప్రపంచ తెలుగు మహాసభల విజయానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలుగు భాష పరిరక్షణలో మండలి కుటుంబం చేస్తున్న సేవలను అభినందించారు. ప్రముఖ రచయిత్రులు యద్దనపూడి సులోచనారాణి, రంగనాయకమ్మ, ఓల్గా, వాసిరెడ్డి సీతాదేవి, డి. కామేశ్వరి సాహిత్య సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. హోంమంత్రిగా తన వద్ద తుపాకి ఉన్నప్పటికీ, సమాజాన్ని మార్చే అసలైన శక్తి కలానిదేనని పేర్కొంటూ "కత్తి కన్నా కలం గొప్పది... గన్ కన్నా పుస్తకం గొప్పది" అని వ్యాఖ్యానించారు. చిన్ననాటి నుంచి పుస్తక పఠనం అలవాటు తన వ్యక్తిత్వ వికాసానికి దోహదపడిందని చెబుతూ, యువత చదవడాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. మహిళలపై పెరుగుతున్న వేధింపులు, సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, మహిళలకు మాత్రమే కాదు అబ్బాయిలకు కూడా మహిళలను గౌరవించే విలువలు, సంస్కారం నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లి, సోదరి లేదా భార్య ఎదుట పలకలేని పదాలను సోషల్ మీడియాలో ఉపయోగించడం సమాజానికి హానికరమని పేర్కొన్నారు. మహిళలను అవమానించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నప్పటికీ వారికి దక్కాల్సిన గౌరవం పూర్తిస్థాయిలో లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను గౌరవించే సమాజమే నిజమైన నాగరిక సమాజమని పేర్కొంటూ, మహిళా రిజర్వేషన్ అమలుకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. తెలుగు భాషను కాపాడే బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని, ప్రతి కుటుంబం, ఉపాధ్యాయుడు, రచయిత, విద్యార్థి కలిసి భావితరాలకు తెలుగు భాషా సంపదను అందించాలని హోంమంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు, రచయిత్రులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### వెలగలేరుకు గోదావరి జలాల రాక,

## ఘనంగా జలహారతి

- పట్టిసీమతో డెల్టాకు భరోసా.. రైతుల్లో ఆనందం



జి.కొండూరు(ప్రశ్న న్యూస్) కృష్ణా డెల్టాకు ఊరటనిచ్చే పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా విడుదలైన గోదావరి జలాలు శనివారం ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనల మేరకు గోదావరి జలాలకు భక్తిశ్రద్ధలతో జలహారతి నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు జంపాల సీతారామయ్య, పోలవరం కుడి ప్రధాన కాలువ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. శ్రీనివాస్ తదితరులు గోదావరి జలాలకు పూలు చల్లి హారతి ఇచ్చి సారె సమర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ పట్టిసీమ ఎత్తిపోతల పథకం కరువు పరిస్థితుల్లో కృష్ణా డెల్టా రైతులకు ప్రాణాధారంగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని, మండల టీడీపీ అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి లంకా నాగేశ్వరరావు, వెలగలేరు సొసైటీ అధ్యక్షుడు మంచినేని రాజశేఖర్, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతుకు ఎరువు.. ప్రభుత్వ భరోసా

- సకాలంలో ఎరువులు, విత్తనాల సరఫరా లక్ష్యం
- అన్నదాత సంక్షేమానికి పెద్దపీట: ఎమ్మెల్యే గౌతు శిరీష



మందస(ప్రశ్న న్యూస్) రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం బాలిగాం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎరువుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. సాగు కాలంలో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రీయ సాగు విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సాంకేతిక సూచనలు అందించాలని సూచించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్‌బుక్‌లను పంపిణీ చేస్తున్నామని, 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతుల ఖాతాల్లో సకాలంలో ఆర్థిక సాయం జమ చేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్, మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, ప్యాక్స్ అధ్యక్షుడు లబ్బ రుద్రయ్య, తమరియా భాస్కర్, ఎంపీడీవో, ఎమ్మార్వో, వ్యవసాయ శాఖ ఏడీ, కూటమి నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ం

# ప్రాణాలు పోతేనే అధికారులకు కళ్లు తెరుచుకుంటాయా.?

- గ్రేటర్ హైదరాబాద్ లో, మేడ్చల్ ఎన్‌హెచ్ -44పై ప్రాణాంతక గుంతలు
- పాలకుల,అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం
- క్లాసిక్ హోటల్ ఎదురుగా మరణ ఉచ్చులు స్పందించని జాతీయ రహదారి అధికారులు
- మరమ్మతుల పేరుతో కోట్ల రూపాయలు, రోడ్లపై మాత్రం గుంతల రాజ్యం
- ప్రమాదం జరిగిన తర్వాత కాదు, జరగక ముందే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజల ప్రాణాలు పోతేనే అధికారులకు కళ్లు తెరుచుకుంటాయా.? అనే ప్రశ్నకు గ్రేటర్ హైదరాబాద్, మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి--44పై కనిపిస్తున్న దుస్థితే సాక్ష్యంగా నిలుస్తోంది. దేశంలో అత్యంత రద్దీగా ఉండే జాతీయ రహదారుల్లో ఒకటైన ఎన్‌హెచ్-44లో క్లాసిక్ హోటల్ ఎదురుగా ఏర్పడిన భారీ గుంతలు ప్రతిరోజూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వేలాది వాహనాలు సంచరించే ఈ మార్గంలో రహదారి పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ అధికారులు మాత్రం కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. భారీ గుంతలు వర్షపు నీటితో నిండిపోవడంతో అవి ఎంత లోతుగా ఉన్నాయో వాహనదారులకు అంచనా వేయడం కూడా అసాధ్యంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతల్లో చిక్కుకుని అదుపుతప్పి కిందపడుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదృష్టం బాగుంటే గాయాలతో బయటపడుతున్నారు. లేకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ప్రతి క్షణం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతం మరింత ప్రమాదకరంగా మారుతోంది. తగినంత లైటింగ్ లేకపోవడం, గుంతలు కనిపించకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు ఒక్కసారిగా అదుపుతప్పుతున్నాయి. వెనుక వస్తున్న వాహనాలు ఢీకొనే ప్రమాదం కూడా అధికంగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద విషాదానికి దారితీసే పరిస్థితులు నెలకొన్నా అధికారులు మాత్రం కార్యాలయాలకే పరిమితమవుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.జాతీయ రహదారుల నిర్వహణ కోసం ప్రతి ఏడాది కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ, ప్రజలకు కనిపిస్తున్నది మాత్రం గుంతలతో నిండిన రహదారులేనని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరమ్మతుల పేరుతో విడుదలవుతున్న నిధులు నిజంగా రోడ్లపైనే ఖర్చవుతున్నాయా.? లేక మధ్యలోనే మాయమవుతున్నాయా.? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వం, పర్యవేక్షణ లోపం కలిసి ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడిగా మరమ్మతులు చేయడం, మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించడం, విచారణలు చేపట్టడం వంటి చర్యలు ప్రజలకు ప్రాణాలను తిరిగి ఇవ్వలేవని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే గుంతలను శాశ్వతంగా పూడ్చి, రహదారిని సురక్షితంగా మార్చడం అధికారుల ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేస్తున్నారు. గ్రేట్ హైదరాబాదులోని అన్ని డివిజన్లో తో పాటు మేడ్చల్ ఎన్‌హెచ్-44పై క్లాసిక్ హోటల్ ఎదురుగా ఉన్న ఈ ప్రాణాంతక గుంతలను వెంటనే శాశ్వతంగా మరమ్మతు చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ అధికారులతో పాటు, జాతీయ రహదారిపై సమగ్ర తనిఖీలు నిర్వహించి మరిన్ని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు, స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. గుంతలతో ప్రాణాలు బలికాక ముందే అధికారులు స్పందిస్తారా, లేక విషాదం కోసం ఎదురుచూస్తారా.? ఇదే ఇప్పుడు ప్రతి వాహనదారుడి ప్రశ్న.

# నిద్రపోతున్న సివిల్ సప్లై అధికారులు

- రెచ్చిపోతున్న రేషన్ బియ్యం మాఫియా
- గ్రేటర్ హైదరాబాద్‌లో యదేచ్ఛగా అక్రమ రవాణా
- ప్రభుత్వ వ్యవస్థకు సవాల్
- దాడులు చేయడం మానేశారా.? లేక మాఫియాతో ఆర్థిక ఒప్పందమా.?
- సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్, పోలీసుల చర్యలే ప్రజలకు చివరి ఆశ




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు నగర శివారు ప్రాంతాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా రోజురోజుకూ విచ్చలవిడిగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోనూ బహిరంగంగానే రేషన్ బియ్యం సేకరణ, నిల్వ, ఇతర రాష్ట్రాలకు తరలింపు జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇంత బహిరంగంగా అక్రమ దందా సాగుతున్నా, సంబంధిత సివిల్ సప్లై అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు తరచూ దాడులు నిర్వహించి అక్రమ రవాణాదారుల గుండెల్లో గుబులు పుట్టించిన సివిల్ సప్లై శాఖ అధికారులు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ రవాణా కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో, ఎవరు నిర్వహిస్తున్నారో అధికారులకు తెలియదా.? లేక తెలిసినా ఉద్దేశపూర్వకంగా చర్యలు తీసుకోవడం లేదా.? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అనేక సందర్భాల్లో సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ అధికారులు, పోలీసులు మాత్రమే దాడులు నిర్వహిస్తూ భారీగా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. అయితే నేరుగా బాధ్యత వహించాల్సిన సివిల్ సప్లై శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెతనట్లు వ్యవహరిస్తూ వ్యవహరిస్తూ ఎందుకు వెనుకబడుతున్నారనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. టాస్క్ ఫోర్స్ అధికారుల చర్యలు ఉన్నప్పటికీ, స్థానిక డిప్యూటీ తాసిల్దార్ ల స్థాయిలో మామూళ్లు తీసుకొని పర్యవేక్షణ బలహీనంగా ఉండటంతో మాఫియా మళ్లీ తలెత్తుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు అక్రమాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. లంచాలు, మామూళ్ల కారణంగానే దాడులు జరగడం లేదని బహిరంగ రహస్యంగా మారిందని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది ప్రభుత్వం నిష్పాక్షికంగా విచారించాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు సూచిస్తున్నాయి. ఎందుకంటే, పేదల కోసం ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న బియ్యం అక్రమ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లడం ప్రజా ధనానికి నష్టం కలిగించే అంశమని వారు పేర్కొంటున్నారు.

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ రేషన్ బియ్యం సేకరణ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, రాత్రి, తెల్లవారుజాము, ఉదయం నిరంతర దాడులు నిర్వహిస్తే ఈ మాఫియాను పూర్తిగా కట్టడి చేయడం అసాధ్యం కాదని మాజీ అధికారులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. అక్రమ రవాణాలో పాల్గొనే వారితో పాటు వారికి సహకరించే అధికారులను శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగింపు వంటి కఠిన చర్యలు తీసుకుంటేనే పరిస్థితిలో మార్పు వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్, మంత్రి ఈ వ్యవహారాన్ని అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని జిల్లా స్థాయి అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ రేషన్ బియ్యం దందాపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం అవినీతి, అక్రమాల నిర్మూలనే లక్ష్యమని చెబుతున్న వేళ, ప్రజల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం మాఫియా చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం కూడా అంతే కీలకం. అధికారులు నిజాయితీగా పనిచేస్తే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడం కష్టమేమీ కాదు. ఇప్పుడు ప్రభుత్వం, సివిల్ సప్లై శాఖ తీసుకునే చర్యలే ఈ మాఫియాకు చెక్ పెడతాయా.? లేక మౌనం కొనసాగుతుందా.? అన్నదే ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్

## - సరికొత్త కారిడార్ ఇంప్రూవ్‌మెంట్ ప్లాన్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వాహనదారుల ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత చెక్ పెట్టేందుకు హుమ్టా సరికొత్త వ్యూహంతో రంగంలోకి దిగింది. గ్రేటర్ పరిధిలో ప్రస్తుతం వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి 18 లక్షలకు పైగా చేరింది. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో రద్దీని తట్టుకునేందుకు వీలుగా ప్రధాన రహదారుల్లో కారిడార్ ఇంప్రూవ్‌మెంట్ ప్లాన్ అమలు చేయాలని నిర్ణయించారు. నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాలను ఎంపిక చేసి, అక్కడ జంక్షన్ల అభివృద్ధి, పాదచారుల జోన్ల ఏర్పాటును చేపట్టనున్నారు. ఈ పైలట్ ప్రాజెక్టును మొదటి విడతలో భాగంగా సిటీలోని మూడు కీలకమైన, అత్యధిక ట్రాఫిక్ సమస్యలు ఉన్న రూట్లలో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. మియాపూర్ నుంచి గండిమైసమ్మ మార్గం, ఒవైసీ హాస్పిటల్ నుంచి తార్నాక మార్గం, ప్యారడైజ్ జంక్షన్ నుంచి అసెంబ్లీ మార్గాల్లో అమలు చేయనున్నారు.

చాలా చోట్ల ఫుట్‌పాత్‌లు వ్యాపారాలు, ఇతర నిర్మాణాలతో ఆక్రమణలకు గురికావడం వల్ల పాదచారులు రోడ్లపై నడవాల్సి వస్తోంది. ఇది తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తుండటంతో, హుమ్టా ఈ ఆక్రమణలను నిర్దాక్షిణ్యంగా తొలగించనుంది. దీంతో పాటు మెయిన్ రోడ్లపై ప్రత్యేకంగా నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్ లైన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రత్యేక మార్గాలలో బైక్‌లు, కార్లు, బస్సులు వంటి ఎలాంటి మోటారు వాహనాలను అనుమతించరు. కేవలం నడిచి వెళ్లే కాలినడక ప్రయాణికులు, సైకిళ్లపై వెళ్లే వారికి మాత్రమే ఇందులో ప్రవేశం ఉంటుంది. ఈ ప్లాన్‌లో భాగంగా ప్రధాన కూడళ్ల వద్ద జంక్షన్ల రీ- డెవలప్‌మెంట్ పనులు చేపడతారు. వాహనాల సాఫీ ప్రయాణానికి వీలుగా యూ-టర్న్‌లను ఏర్పాటు చేయనున్నారు. రహదారి మధ్యలో సెంట్రల్ మీడియన్ అభివృద్ధి పనులు చేపడతారు. అన్నిటికంటే ముఖ్యంగా స్పేస్ వాకర్స్ పేరుతో రోడ్లపై ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆర్టీసీ బస్సులకు వేర్వేరుగా లేన్ మార్కింగ్స్ వేస్తారు. ఏ వాహనం దానికి కేటాయించిన మార్కింగ్‌లోనే వెళ్లాల్సి ఉంటుంది. దీనివల్ల ఒకదానికొకటి అడ్డు రాకుండా వాహనాలు సజావుగా సాగిపోవడానికి వీలవుతుందని అధికారులు చెబుతున్నారు.

# మా నాన్న మృతికి ప్రతీకారం తప్పదు

## - మొజ్తబా ఖమేనీ ప్రకటన



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. తన తండ్రి, ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ శపథం చేశారు. టెలిగ్రామ్ ద్వారా విడుదల చేసిన సందేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడిలో అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన తండ్రి మృతికి కారకులైన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మొజ్తబా హెచ్చరించారు. ఇది దేశ ప్రజల డిమాండ్ అని, తన నాయకుడితో పాటు అమరులైన వారి తరఫున హంతకులపై ప్రతీకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తబా జులై 9న జరిగిన తన తండ్రి అంత్యక్రియలకు కూడా హాజరు కాలేకపోయారు. తనను లక్ష్యంగా చేసుకుంటే తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించిన నేపథ్యంలో మొజ్తబా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# యూజర్ల దెబ్బకు దిగొచ్చిన మెటా

## - ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ వివాదాస్పద ఏఐ ఫీచర్ తొలగింపు!




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సోషల్ మీడియా దిగ్గజం మెటాకు యూజర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఫీచర్‌ను, ప్రారంభించిన కొద్ది రోజులకే ఉపసంహరించుకుంది. యూజర్ల ప్రైవసీ, వారి కంటెంట్ వినియోగంపై తీవ్ర ఆందోళనలు వెల్లువెత్తడంతో మెటా ఈ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని 'టెక్‌క్రంచ్' తన కథనంలో మొదటగా వెల్లడించింది. 'మ్యూజ్ ఇమేజ్' పేరుతో మెటా తీసుకొచ్చిన ఈ కొత్త టూల్ ద్వారా, ఇన్‌స్టాగ్రామ్‌లోని పబ్లిక్ అకౌంట్ల ఫొటోలను ఉపయోగించి యూజర్లు ఏఐ చిత్రాలను సృష్టించవచ్చు. ప్రాంప్ట్‌లో ఒక పబ్లిక్ అకౌంట్‌ను మెన్షన్ చేస్తే చాలు, ఆ అకౌంట్‌లోని ఫొటోల ఆధారంగా కొత్త ఏఐ చిత్రాలు జనరేట్ అవుతాయి. అయితే, ఈ ఫీచర్ యూజర్ల అనుమతి లేకుండానే డీఫాల్ట్‌గా ఎనేబుల్ అవ్వడం పెను దుమారానికి కారణమైంది. తమ పబ్లిక్ ఫొటోలను ఏఐ కోసం వాడకూడదనుకునే వారు, సెట్టింగ్స్‌లోకి వెళ్లి మాన్యువల్‌గా ఈ ఫీచర్‌ను ఆఫ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానంపై యూజర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. విమర్శలు పెరుగుతుండటంతో మెటా వెంటనే స్పందించింది. యూజర్లకు తమ పబ్లిక్ కంటెంట్‌పై నియంత్రణ ఇస్తూనే, ఒక సృజనాత్మక టూల్‌ను అందించాలనేది తమ ఉద్దేశమని, కానీ ఈ విషయంలో తాము విఫలమయ్యామని అంగీకరించింది. అందుకే ఈ ఫీచర్‌ను పూర్తిగా అందుబాటులో లేకుండా చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఫీచర్‌పై కేవలం యూజర్లే కాకుండా ప్రైవసీ హక్కుల కార్యకర్తలు, నటీనటులు, మీడియా నిపుణుల సంఘాలు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ముఖ్యంగా నటుల యూనియన్ 'శాగ్-ఆఫ్ట్రా', వ్యక్తుల చిత్రాలను ఏఐ కోసం వాడే ముందు స్పష్టమైన అనుమతి తీసుకోవాలని, లేకపోతే వారి అనుమతి లేకుండానే డిజిటల్ ప్రతిరూపాలను సృష్టించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ సంఘటనతో ఏఐ ఉత్పత్తుల విషయంలో పారదర్శకంగా ఉండాలని, యూజర్ల డేటా వినియోగంపై వారికి పూర్తి నియంత్రణ ఇవ్వాలన్న డిమాండ్ టెక్ కంపెనీలపై మరింత బలపడుతోంది.

# రంగారెడ్డి జిల్లా హత్యలపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి

## - కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రంగారెడ్డి జిల్లా షాబాద్, దైవాలగూడ ప్రాంతాల్లో జరిగిన ఘోర హత్యల ఘటనపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజస్థాన్ పర్యటనలో ఉన్న మంత్రి, ఘటన వివరాలు తెలియగానే సంబంధిత పోలీస్ కమిషనర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి సమాచారం సేకరించారు. నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు తక్షణం సహాయం అందించాలని, మానసిక-సామాజిక తోడ్పాటు కల్పించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను సూచించారు.

మహిళలు, పిల్లల భద్రతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, నేరస్థులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని సీతక్క హెచ్చరించారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. కేసు వివరాల్లోకి వెళితే రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన దారుణ హత్యల వెనుక పోక్సో కేసు కక్ష ఉందని పోలీసు దర్యాప్తు వెల్లడైంది. నిందితుడు రాజ్‌కుమార్ (28) తనపై పోక్సో కేసు నమోదు చేసి జైలు పంపిన బాలిక, ఆమె తల్లి, నానమ్మను కత్తితో నరికి చంపాడు. అనంతరం తన భార్య సరిత (పార్వతి సరిత), 3 ఏళ్ల కుమార్తె, 2 ఏళ్ల కుమారుడిని కూడా కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘోర ఉదంతంలో మొత్తం ఆరుగురు మృతి చెందారు. గత మే 16న బాలికను వేధించాడని ఆమె తల్లి ఫిర్యాదు చేయగా, పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి మే 26న రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. శుక్రవారం బెయిల్‌పై విడుదలైన వెంటనే ఈ దారుణం చేశాడని పోలీసులు తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588